Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 249 | హైదరాబాద్ | గురువారం 23 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## విద్యా విధానమే రిగ్గయ్యింది

### గత పదేళ్లలో 152 పేపర్లు లీక్.. ఏ ఒక్కరికీ శిక్ష పడలేదు

### ఒత్తిళ్లు తట్టుకోలేక విద్యార్థుల ఆత్మహత్య

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

న్యూఢిల్లీ, జూలై 22: బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో 152 సార్లు పేపర్లు లీకేజీలు జరిగాయని, అన్ని సార్లు పేపర్ లీకేజీలు జరిగినా ఒక్కరికి కూడా శిక్ష పడలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ సమీపం వరకు సోమ వారం విద్యార్థులపై అమానుషంగా లాఠీఛార్జ్ చేశారని రాహుల్ అన్నారు. నిరసనలు తప్ప విద్యార్థులు చేసిన నేరం ఏమిటని నిలదీశారు. దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో బుధ వారం ఆయన మీడి యాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. విద్యా వ్యవస్థలో నెల కొన్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకులు, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల లీకులకు ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని

- మిగతా 2వ పేజీలో



# కాంగ్రెస్ X బీజేపీ

## హస్తం, కమలం శ్రేణుల పోటాపోటీ నిరసనలు

### రణరంగంగా మారిన బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయ ప్రాంతాలు

గన్ ఫౌండ్రి: దేశ రాజధానిలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తదితర నేతలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వగా, దేశ ప్రధాని నివాసం ఎదుట కాంగ్రెస్ వ్యవహరించన తీరును నిరసిస్తూ బీజేపీ గాన్యదీభవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో బుధవారం గాంధీభవన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ పరిసర ప్రాంతాలు రణరంగంగా మారాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న బీజేపీ శ్రేణులు అడ్డుకోవడంతో పరిస్థితి విషమించింది. ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకోవడంతోపాటు కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఒక టీవీ జర్నలిస్టు, మహిళా కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి.

**బీజేపీ ఆధ్వర్యంలో...**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ విచ్ఛిన్నకర రాజకీయాలు, రాహుల్‌గాంధీ దేశ వ్యతిరేక వైఖరిపై బీజేపీ పోరుబాట చేస్తుందని చెప్పారు. నీట్ పరీక్ష పత్రం లీకేజిపై పార్లమెంటులో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాహుల్ ప్రధాని నివాసం ముట్టడికి దిగడం ఆయన అపరిపక్వతకు నిదర్శనమని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనలో అసలు విద్యార్థులే లేరని, కేవలం సామాజిక విద్రోహ, అల్ట్రాలెఫ్ట్ మూకలను జమచేసి ఆందోళనలు చేయిస్తున్నారని ఆరోపించారు. అనంతరం

- మిగతా 2వ పేజీలో



## అర్హుల ఓట్లు తొలగి పోకూడదు

### బీఆర్ఎస్ 'సర్' కమిటీతో సమీక్షలో కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. పార్టీ ఏర్పాటు చేసిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీతో బుధవారం తన నివాసంలో కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్.రమణ నేతృత్వంలోని కమిటీ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వివరించింది. లక్షల మంది ఓటర్ల పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో చాలామందికి నోటీసులు జారీ చేయాల్సిన విభాగంలో చేర్చారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటి వారికి వెంటనే మార్గనిర్దేశం చేసి అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలన్నారు.



## ప్రధానితో శరద్ పవార్ భేటీ

### త్వరలో రెండు ఎన్సీపీల విలీనం!

న్యూఢిల్లీ: దేశంలో రాజకీయ పరిణామాలు వే గంగా మారిపోతున్నాయి. మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)లోని రెండు వర్గా లు ఒక్కటైపోయి, ఎన్డీయేలో చేరుతాయన్న ఊహాగానాలు నిజమేనన్న సంకేతాలు వెలువడుతు న్నాయి. ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ తన కుమార్తె సుప్రియా సూలేతో కలిసి బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. మోదీతో భేటీ అనంతరం శరద్ పవార్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. నీట్-యూజీ పేపర్‌పై విద్యార్థులు డిమాండ్లు, రైతుల సమస్యలు, వాటర్ మేనేజ్‌మెంట్, విద్యా రంగం సమస్యలపై తాము చర్చించినట్లు తెలిపారు. ఎన్సీపీలో రెండు వర్గాలున్నాయి. ఒక వర్గానికి శరద్ పవార్, మరో వర్గానికి ఆయన కోడలు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ నేతృత్వం వహిస్తున్నారు. సునేత్ర పవార్ పార్టీ ఇప్పటికే ఎన్డీయేలో భాగస్వామిగా కొనసాగుతోంది. శరద్ పవార్

- మిగతా 2వ పేజీలో

## జనసేనానికి కొత్త ఆయుధం గడల

- ఆయన చేరికతో తెలంగాణలో కొత్త ఊపు
- అన్ని వర్గాల్లోకి పార్టీ వెళ్లేందుకు అవకాశం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు
- కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా పోటీ

తెలంగాణలో పార్టీ విస్తరించాలని చూస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు రాష్ట్రంలో మంచి అస్త్రం దొరికింది. పార్టీని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లక్ష్యానికి ఓ సేనాని దొరికారు. ఆయనే మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు. డాక్టర్ గడల శ్రీనివాసరావు తాజాగా జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరడంతో ఆ పార్టీకి తెలంగాణలో కొత్త ఊపు వచ్చింది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, కొత్తగూడెం)

తెలంగాణలోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో.. భద్రాద్రి కొత్తగూడెం నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు బరిలోకి దిగేందుకు అవసరమైన రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గడల శ్రీనివాసరావు జనసేనలోకి చేరడం అనేది ఓ నాయకుడి చేరికగా కాకుండా.. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు.. జనసేన ప్రజల్లోకి వెళ్లేందుకు... తెలంగాణలో పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టిన పవన్ కళ్యాణ్‌కు ఇది తొలి పెద్ద రాజకీయ బూస్టర్‌గా మారిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఉద్యోగ జీవితం నుంచే ప్రజాసేవకు అంకితం అయ్యారు. ఆయన హెల్త్



- మిగతా 2వ పేజీలో

## నిరసన తెలిపితే పాశవిక దాడులా?

- రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందింది
- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- నరేంద్ర, ధర్మేంద్ర ఇద్దరూ దేశాన్ని దోచుకుంటున్నారు
- కొడంగల్ ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, జూలై 22 : నీట్ పేపర్ లీకేజీపై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం రేవంత్‌రెడ్డి ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవిక దాడులు చేస్తారా అని ప్రశ్నించారు కేంద్ర ప్రభుత్వ వైఖరి, పోలీసుల పాశవిక దాడులపై కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తన నివాసం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టి, స్థానిక అంబెద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా పార్టీలు మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, నీట్ పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అంటూ ప్రశ్నించారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించకుండా పోయారని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లా రా?




ఎవరైనా కిడ్నాప్ చేశారా అని సందేహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. పాశవిక దాడితో రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందిందని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని చెప్పారు. ప్రజా స్వామ్యంలో నిరసన

- మిగతా 2వ పేజీలో



## పోలీసు రాజ్యం నడవదు

### నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

### 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్/నాంపల్లి: ప్రజాస్వామ్య భారత్‌లో పోలీసు రాజ్యం నడవదని, విద్యార్థులు, యువకుల ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గక తప్పదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆత్మఘోషకు కారణమైన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతాన్ని ఈ దేశం మర్చిపోదని వ్యాఖ్యానించారు. నీట్ ఘటనపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ ఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు శాంతియుత ఆందోళన చేస్తున్న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో 'చలో లోక్ భవన్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో నియంత పాలన సాగుతోందని మండిపడ్డారు. ప్రశ్నపత్రం

- మిగతా 2వ పేజీలో

# ప్రధానితో శరద్ పవార్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ విపక్ష 'ఇండియా' కూటమిలో భాగస్వామి. రెండు పార్టీలు విలీనమై, ఎన్డీయేలో చేరుతాయన్న ప్రచారం చాలా రోజులుగా జరుగుతోంది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల డీలిమిటేషన్ విషయంలో రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. ఈ మెజార్టీ కోసం ఎన్డీయే ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఎన్సీపీలోని వర్గాలను ఏకం చేసే ప్రయత్నాలు ఊపందుకున్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ X బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

గాంధీభవన్ ముట్టడికి వెళ్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకుని గోషామహాల్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఎన్.రామచందర్ రావు, ఇతర బీజేపీ నేతల అరెస్ట్‌పై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, ఎం.రఘునందన్‌రావు, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, ఖండించారు. నీట్ ప్రశ్నపత్రం అంశంపై లోక్ సభలో చర్చకు సిద్ధమని కేంద్రం ముందుకు వచ్చినా కూడా చర్చకు రాకుండా కాంగ్రెస్ రాజకీయం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజిపై విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ విప్ బల్మూరు వెంకట్ డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు.

### కరీంనగర్‌లో ఉద్రిక్తత

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ నిరసన కరీంనగర్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నగరంలోని కార్ఖానగడ్డ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టి, కోర్టుసర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి ఊహించని విధంగా సమీపంలో ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వైపు ర్యాలీ మళ్లింది. అప్రమత్తమైన పోలీసులు మేడిపల్లి సత్యంను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. పీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ తదితరులు కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. కార్యాలయంలో ఉన్న బీజేపీ కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు తదితరులు కర్రలతో కాంగ్రెస్ నాయకులపై దాడి చేశారు. కార్యాలయం గేట్ వేసి పోలీసులు అడ్డుకుంటున్నప్పటికీ, ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. చెప్పులు, కుర్చీలు విసురుకున్నాయి. పోలీసులు లాఠీచార్జ్ చేసి కాంగ్రెస్ శ్రేణులను చెదరగొట్టారు. ప్రతిగా కాంగ్రెస్ కార్యాలయంపై దాడికి బీజేపీ నేతలు సిద్ధమవగా డీసీసీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జనసేనానికి కొత్త ఆయుధం గడల

(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టర్‌గా ఉన్న సమయంలోనే తన తండ్రి పేరిట జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రజలకు దగ్గరయ్యారు. అప్పట్లోనే రాజకీయ రంగప్రవేశంపై బలమైన ప్రచారం సాగింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన భద్రాద్రి కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అన్ని రకాలుగా గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకున్నారు. జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలు, విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళ్లారు. తర్వాతి పరిణామాల్లో ఆయన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు.

### కొత్తగూడెం నుంచే పోటీ

మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు మళ్లీ కొత్తగూడెం కేంద్రంగా.. జనసేన వేదికగా రాజకీయాల్లో కీలకవ్యక్తిగా మారుతున్నారు. ఆయన జనసేన తరఫున కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు జనసేనాని పవన్‌కల్యాణ్ నుంచి బలమైన హామీ తీసుకుని రంగంలోకి దిగారు. ఈ మేరకు ఆయన ఇప్పటి నుంచి కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఆయన ఇక్కడి నుంచి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

### ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా..

తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేసే దిశగా మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావును ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా జనసేనాని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఆయనకు ఉమ్మడి జిల్లా బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం.. కార్యకర్తలకు... నాయకులకు దిశానిర్దేశనం చేయాల్సిన బాధ్యతలను అప్పగించారు.

# విద్యా విధానమే రిగ్గయ్యింది

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఎన్డీఏ సర్కారు పబ్లిక్ సెక్టార్లను ప్రైవేటీకరిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సర్కారు ముందు రాహుల్ గాంధీ మూడు డిమాండ్లు పెట్టారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి, విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

### అన్నీ అక్రమాలే..

'అందరికీ స్పష్టంగా కనిపిస్తున్న విషయం ఏంటంటే, ఒకప్పుడు ప్రపంచంలో అత్యుత్తమ విద్యా వ్యవస్థల్లో ఒకటిగా పేరొందిన మన విద్యా వ్యవస్థ ఇప్పుడు అక్రమాలతో నిండిన వ్యవస్థగా మారింది. గత 10 ఏళ్లలో 152 ప్రశ్నాపత్రాల లీకులు జరిగాయని మనకు తెలుసు. లెక్క వేస్తే నెలకు దాదాపు ఒకటి చొప్పున జరుగుతున్నట్టే. దీని ప్రభావం 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలపై పడింది. వీరంతా మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందినవారు. కష్టపడి సంపాదించిన డబ్బును పిల్లల చదువు కోసం ఖర్చు చేస్తున్నారు. చివరికి వారి ఆశలను పూర్తిగా అవమానిస్తున్నారు. ఇందులో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఒక్కరికీ శిక్ష పడలేదు. అంటే కొందరు వ్యక్తులు లేదా ఒక వర్గం మన విద్యా వ్యవస్థను, దేశంలో అత్యంత విలువైన సంపదైన విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క శిక్ష కూడా పడలేదు. వ్యవస్థ అక్రమాలతో నిండిపోయిందన్న విషయం ఒక్కటే కాదు, అది సామాన్య ప్రజలకు అందని స్థాయిలో ఖరీదుగా కూడా మారింది. ఈ గణాంకాలు ప్రతి యువకుడికి తెలుసు. కానీ భారత ప్రభుత్వం మాత్రం తెలుసుకోలేకపోతోంది. ఒక పరీక్ష రాసే కుటుంబాలు ఖర్చు చేస్తున్న మొత్తం, కేంద్ర ప్రభుత్వం విద్య కోసం కేటాయిస్తున్న మొత్తం బడ్జెట్‌కు దాదాపు సమానం. ప్రజల నుంచి పన్నులు వసూలుచేసిన తర్వాత, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఖర్చు చేసే నిధినే విద్యా బడ్జెట్ అంటారు. అది రూ.1.4 లక్షలకోట్లు. అదే సమయంలో, ప్రతి ఏడాది నీట్ పరీక్ష రాసే కుటుంబాలు కలిపి రూ.1.32లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇది ఆ కుటుంబాల నుంచి జరుగుతున్న బహిరంగ దోపిడీ తప్ప మరొకటి కాదు. అంత డబ్బు ఖర్చు చేయించిన తర్వాత ప్రశ్నపత్రం లీక్ అయిందని చెబుతున్నారు. అంటే మొత్తం వ్యవస్థ అక్రమాలతో నిండిపోయింది. యువత వీధుల్లోకి రావడానికి ఇదే రెండో కారణం. అది పూర్తిగా సరైన కారణం' అని రాహుల్ అన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, ఆయన ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని ధ్వజమెత్తారు. 'ఎవరో ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం మన విద్యా వ్యవస్థను, దేశ అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది?' అని ప్రశ్నించారు.

### అందుకే మెరుపు ధర్నా..

విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాహుల్ దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి నివాసం వద్ద ప్రతిపక్ష నాయకుడు ధర్నాకు దిగడమేమిటి? అని బీజేపీ విమర్శించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. 'నీట్ పేపర్ లీక్‌పై, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలనే అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వం మిన్నకుంది. ఇక లాభంలేదని కాంగ్రెస్ ప్రధాని నివాసం వద్ద ధర్నా చేసింది. యువత ఆగ్రహాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి కదా. ప్రస్తుత పరిస్థితుల్లో మా ధర్నా తప్పు కాదు.'

# పోలీసు రాజ్యం నడవదు

(మొదటి పేజీ తరువాయి)

లీక్ చేసి 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేసిన మోదీ ప్రభుత్వం సిగ్గులేకుండా ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేకుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న రాహుల్‌గాంధీతోపాటు ఇతర విపక్ష ఎంపీలను అరెస్టు చేయడం దారుణమన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని, ఈ ఉదంతంపై పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర చర్చ జరపాలని డిమాండ్ చేశారు.

### సంకెళ్లు వేసుకుని నిరసన..

ఆందోళనలో భాగంగా మహేశ్‌గౌడ్, మంత్రి పొంగులేటి, విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే దానం నాగేందర్, రోహిణ్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు చేతులకు సంకెళ్లు వేసుకుని ఇందిరమ్మ విగ్రహం ముందు కూర్చుని నిరసన తెలియజేశారు. అనంతరం నెక్లెస్‌రోడ్డులోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు భారీస్థాయిలో చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి లోక్‌భవన్ వైపునకు దూసుకెళ్లే యత్నం చేశారు. అయితే, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. మహేశ్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అజహరుద్దీన్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, టీపీసీసీ నేతలను అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు ఎంఏ ఫయీమ్, మెట్టు సాయికుమార్, నూతి శ్రీకాంత్, దీపక్‌జాన్, జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ నేతలు బండి రమేశ్, నీలం మధు, చనగాని దయాకర్, ఫహీం ఖురేషీ, పిడమర్తి రవితోపాటు పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అదుపులోకి తీసుకున్న అనంతరం మంత్రులు, కాంగ్రెస్ నేతలను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించగా, వారు స్టేషన్‌లోనే బైఠాయించి నల్ల కండువాలు ధరించి నిరసన తెలియజేశారు. సుమారు రెండు గంటల పాటు అక్కడే బైఠాయించారు. వీరిని పరామర్శించేందుకు పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం సొంతపూచీకత్తుపై నేతలను విడుదల చేశారు.

# జనరిక్ ఔషధాలపై 100% సుంకం

## అమెరికాలో తయారుకాని వాటిపైనే

- 2028 ఆగస్టు నుంచి విధిస్తాం
- 2029 నుంచి 200% పన్ను: ట్రంప్

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ఔషధ' రంగంపై సుంకాల బాంబును సిద్ధం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి రెండేళ్లపాటు జనరిక్ మందుల దిగుమతిపై సున్నా శాతం పన్ను విధానాన్నే అమెరికా కొనసాగిస్తుంది. 2028 ఆగస్టు నుంచి జనరిక్స్‌పై ఏకంగా 100% సుంకం విధిస్తారు. 2029 ఆగస్టు నుంచి ఈ మొత్తాన్ని 200 శాతానికి పెంచుతామని సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ప్రకటించారు. ఈ లోపు అమెరికాలో తయారీ ప్లాంట్లు, అవసరమైన పరికరాలు సమకూర్చుకుని, ఔషధాలు కూడా అక్కడే రూపొందించాలని.. లేనిపక్షంలో ఈ భారీ సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. 'అమెరికా ప్రజల ప్రయోజనాలను రక్షించడంతో పాటు, దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకే ఈ కఠిన విధానాన్ని అమలు చేయనున్నట్టు'?ల ట్రంప్ పేర్కొన్నారు. ఇప్పటికే పేటెంట్ ఉన్న, బ్రాండెడ్, వినూత్న ఔషధాల విధానంలో మార్పేమీ ఉండదని వివరించారు.

### మన ఫార్మారంగంపై ప్రభావం ఎంత?

జనరిక్ ఔషధాల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్న మనదేశంపై, ట్రంప్ తాజా నిర్ణయ ప్రభావంపై చర్చలు నడుస్తున్నాయి. అమెరికాలో దాదాపు 90% ప్రిస్క్రిప్షన్లలో ఉండే యాంటీబయాటిక్స్, స్టాటిన్స్ వంటి జనరిక్ మందులు మన దేశంలోనే తయారవుతున్నాయి. ఇక్కడి స్థాయిలో అమెరికాలో భారీ ప్లాంట్లు నడపాలంటే అధిక వ్యయాలు తప్పవు. ఇక్కడ నుంచే పంపాలంటే సుంకాలు పడతాయి. రెండింటిలో ఏది మేలు చేస్తుందో వేచి చూడాల్సిందే. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ నివేదిక ప్రకారం, 2025లో భారత్ చేసిన రూ.2.4 లక్షల కోట్ల ఔషధ ఎగుమతుల్లో.. అమెరికాకే రూ.93,000 కోట్ల (38%) విలువైనవి చేరాయి. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, అంటువ్యాధులు, మానసిక రుగ్మతలకు వాడే కీలక జనరిక్ మందుల సరఫరాకు మనదేశంపైనే అమెరికా ఆధారపడుతోంది. వాటి తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం చైనాపై విపరీతంగా ఆధారపడటాన్ని జాతీయ భద్రతా లోపంగా అమెరికా పరిగణిస్తోంది. ఈ విషయంలో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఏకాభిప్రాయంతో ఉన్నారు.

### అమెరికా వినియోగదార్లకే భారం

ట్రంప్ సుంకాలు అమలైతే, అమెరికాలో ఔషధాల ధరలు విపరీతంగా పెరగడమే కాకుండా కీలకమైన మందులకు కొరత ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జనరిక్ ఔషధ తయారీదారుల సంఘం సీఈఓ జాన్ మర్ఫీ మాట్లాడుతూ.. ఈ రంగం మనుగడ కోసం ప్రభుత్వాలతో కలిసి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని తెలిపారు. జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. 'బ్రాండెడ్ ఔషధాలతో పోలిస్తే భారత జనరిక్ మందులు ఏడు నుంచి పది రెట్లు తక్కువ ధరకే లభిస్తాయి. అందువల్ల 100% సుంకం విధించినా అవి పోటీని తట్టుకోగలవు. సుంకాల భారమంతా చివరికి అమెరికా ఆరోగ్య సంరక్షణ సంస్థలు, బీమా కంపెనీలు సహా అక్కడి రోగులపైనే పడుతుంది. ఈ నేపథ్యంలో భారత కంపెనీలు అమెరికా మార్కెట్‌పై అతిగా ఆధారపడకుండా ఐరోపా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా మార్కెట్లకు తమ కార్యకలాపాలను విస్తరించుకోవాలి' అని పేర్కొన్నారు.

### ప్లాంట్ల తరలింపు అసాధ్యం –డాక్టర్ రెడ్డీస్

ట్రంప్ సుంకాలపై డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ స్పందిస్తూ.. అమెరికా సుంకాలు విధిస్తే, అక్కడకు ఎగుమతి చేసే మందుల ధరలను పెంచక తప్పదని స్పష్టం చేశారు. తయారీ వ్యయాల్లో భారీ తేడా ఉంటుంది కనుక, ప్లాంట్లను అమెరికాకు తరలించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. వ్యాపారానికి ప్రయోజనం చేకూర్చే భాగస్వామ్యాలు, కాంట్రాక్ట్ తయారీ ఒప్పందాలకు ప్రయత్నిస్తామన్నారు.

### ఫార్మా షేర్లపై ఒత్తిడి..

ట్రంప్ ప్రకటన నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచే ఫార్మా షేర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. లుపిన్ 4.21%, నాట్కో ఫార్మా 3.21%, అరబిందో ఫార్మా 1.99%, డాక్టర్ రెడ్డీస్ 1.95%, గ్లెన్‌మార్క్ ఫార్మా 1.49%, ఆల్కెమ్ 1.43%, సిప్లా 1.08%, సన్‌ఫార్మా 0.98%, బయోకాన్ 0.57% చొప్పున నష్టాలు నమోదుచేశాయి.

# నిరసన తెలిపితే పాశవిక దాడులా?

(మొదటి పేజీ తరువాయి)

తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని, పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా ప్రధాని అడ్డుకున్నారని విమర్శించారు.

### దేశాన్ని దోచుకుంటున్న నరేంద్ర, ధర్మేంద్ర

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొందన్నారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని గ్లోబరీనా సంస్థ కోఎంప్ట్ ఎడ్యుకేషన్‌గా పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని, ఢిల్లీ బీజేపీ వాళ్లతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారని ఆరోపించారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. సీబీఎస్ఈలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని, ధర్మేంద్ర ప్రధాన్ ను పదవి నుంచి తొలగించకుండా విద్యార్థుల తలలు పగలగొట్టారని కేంద్రం వైఖరిని సీఎం తప్పుపట్టారు. అంతకుము కొడంగల్‌లోని తన నివాసంలో ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించిన సీఎం... పార్టీ నేతలు, కార్యకర్తలతో క లిసి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులున్నారు.

# ప్రధాన్ రాజీనామాకు విపక్షాల పట్టు

## నీట్‌పై చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించినా వెనక్కి తగ్గని విపక్షాలు

## విద్యా శాఖమంత్రి రాజీనామా చేశాకే చర్చించాలంటూ ఆందోళన

## నల్ల దుస్తులతో సభకు హాజరు



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మకమైన నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విపక్షాలు పట్టుబట్టడంతో పార్లమెంట్ సమావేశాల మూడో రోజూ ప్రతిష్టంభన నెలకొంది. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై పోలీసుల దాష్టీకం, ప్రధాన్ రాజీనామా డిమాండ్ అంశాలపై అధికార--ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలతో సభా కార్యక్రమాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ప్రభుత్వం నీట్ అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, ముందుగా ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షం పట్టుబట్టడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. ఉభయ సభల ఆరంభానికి ముందే నీట్‌పై చర్చ కోరుతూ కాంగ్రెస్ ఎంపీలు కేసీ వేణుగోపాల్, హిబి ఈడెన్ లోక్‌సభలో వాయిదా తీర్మానం నోటీసులు ఇచ్చారు. నల్ల దుస్తులు ధరించి లోక్‌సభకు హాజరైన విపక్షాల ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగడంతో లోక్‌సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి మొదలయ్యాక కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడారు. నీట్‌పై తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. 'విద్యార్థుల భవిష్యత్తు మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. నీట్ పేపర్ లీక్, పరీక్షల పారదర్శకత, ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సమగ్రంగా చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం'అని తెలిపారు. చర్చ ఏ తేదీన నిర్వహించాలనేది స్పీకర్ ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సంప్రదించి నిర్ణయిస్తామని చెప్పారు. దీనిపై సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ జోక్యం చేసుకున్నారు. విద్యార్థుల లాఠీచార్జ్ ఉదంతంపై ప్రధాని సభలో ఎందుకు ప్రకటన చేయలేదు? అని నిలదీశారు. "ఈ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తీరా చర్చిద్దామంటే ముందుగా ధర్మేంద్ర మంత్రి పదవికి రాజీనామాచేయాలనే కొత్త షరతు పెడుతున్నారు. అమలుసాధ్యంకాని షరతులు పెట్టి చర్చకు కాంగ్రెస్ మోకాలడ్డుతోంది"అని రిజిజు విమర్శించారు.

# ఒకే ఫార్ములా.. సగం ధర!



## 'జనరిక్' మందులతో ప్రయోజనాలెన్నో

దీర్ఘకాలిక వ్యాధులకు మందులు కొంటున్నారా? ప్రైవేటు దుకాణాల్లో ఇందుకు వేలల్లో ఖర్చవుతోందా..? అయితే, అవే మందులు జనరిక్‌లో కొనండి. ఇలాచేస్తే.. అదే నాణ్యతతో మందులు లభించడమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుంది. సాధారణంగా జనరిక్ మందులపై ఉండే అనుమానాలు, అపోహలను వీడి కొనుగోలు చేస్తే మేలంటున్నారు నిపుణులు. అంతర్జాతీయ డ్రగ్ కంట్రోల్ వ్యవస్థ ప్రమాణాల మేరకు తయారుచేయడంతో శరీరంలో వీటి ప్రభావం ఒకేలా ఉంటుందని సూచిస్తున్నారు. జనరిక్ మందులపై జరుగుతున్న ప్రచారాన్ని వదిలేస్తే ఔషధాలన్నీ తక్కువ ధరకే కొనుగోలు చేయొచ్చని చెబుతున్నారు.

### బ్రాండ్ వర్సెస్ ఏపీఐ

వాడే ప్రతి మందులోనూ రోగాన్ని నయం చేసే ఒక ప్రధాన కెమికల్ ఉంటుంది. దీన్నే మెడికల్ భాషలో 'సాల్ట్' లేదా యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్' (ఏపీఐ) అంటారు. ఉదాహరణకు అసలు మందు పేరు పారాసిటమల్ అయితే మార్కెట్‌లో అది వివిధ బ్రాండ్ల పేర్లతో దొరుకుతుంది. ఫార్ములా ఒకటే అయినా.. వందల పేర్లతో, రకరకాల ధరలకు అమ్మడంతో ప్రజల్లో గందరగోళం మొదలవుతోంది.

### అపోహలు.. వాస్తవాలు

తక్కువ నాణ్యత: ఈ అపోహ సరికాదు. వాస్తవానికి బ్రాండెడ్ మందుల తయారీకి పాటించే అంతర్జాతీయ డ్రగ్ కంట్రోల్ నాణ్యత ప్రమాణాలే జనరిక్ మందులకూ వర్తిస్తాయి.

కేవలం పేదవాళ్లకే..: ఇది నిజం కాదు. అమెరికా, యూరప్ లాంటి దేశాల్లో 80 శాతానికి పైగా ప్రిస్క్రిప్షన్లు జనరిక్ మందులవే ఉంటాయి. అక్కడ సంపన్నులు, మధ్య తరగతి వారందరూ ఇవే వాడతారు.

ఆలస్యంగా పనిచేస్తుంది: ఇది తప్పు. రెండింటిలోనూ ఉండే ప్రధాన కెమికల్ (ఏపీఐ) ఒక్కటే. కాబట్టి శరీరంపై వీటి ప్రభావం, నయం చేసే విధానంలో ఎలాంటి తేడా ఉండదు.

### ధరల్లో తేడాలు ఇందుకే?

పెద్దపెద్ద కంపెనీలు ఒక మందును మార్కెట్‌లోకి తెచ్చేటప్పుడు.. ప్యాకింగ్, మార్కెటింగ్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ద్వారా ప్రమోషన్లు చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతుంటాయి. ఈ ఖర్చులన్నింటినీ కలిపి ఆ మందుల ఎమ్మార్పీపై వేస్తాయి. కానీ జనరిక్ మందులకు ఎలాంటి మార్కెటింగ్ లేదా ప్రమోషన్స్ ఉండవు. నేరుగా ఇవి మార్కెట్‌లోకి వస్తాయి. అందుకే బ్రాండెడ్ మందుల కంటే 50 నుంచి 80 శాతం తక్కువ ధరకు లభిస్తాయి.

### ఇలా చేయండి..

ప్రిస్క్రిప్షన్‌లో బ్రాండ్ పేరుతో పాటు బ్రాకెట్‌లో జనరిక్(ఏపీఐ) పేరు రాయాలని అడిగే హక్కు ప్రతి రోగికీ ఉంది. మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం వైద్యులు జనరిక్ పేర్లు రాయడం తప్పనిసరి.

కేంద్ర ప్రభుత్వానికి చెందిన జన్ ఔషధి సుగమ్ లాంటి మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. దీనిద్వారా మీకు కావాల్సిన మందులకు జనరిక్ ప్రత్యామ్నాయాలు ఎక్కడ దొరుకుతాయో, ధరల్లో తేడాలను సులభంగా చూసుకోవచ్చు.

కేంద్ర ప్రభుత్వ 'జన ఔషధి కేంద్రాలు', 'జనరిక్ ఆధార్' లాంటి ప్రైవేటు అవుట్‌లెట్లు ఇప్పుడు ప్రతి ఊరిలోనూ అందుబాటులోకి వస్తున్నాయి. అక్కడికి వెళ్లి ధైర్యంగా నాణ్యమైన జనరిక్ మందులను తక్కువ ధరకే కొనుగోలు చేయొచ్చు.

## మోదుగుల గూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా అనబత్తుల ఉపేందర్ ఏకగ్రీవ ఎన్నిక

### డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్ సహాకారం తో యువత కు పెద్ద పీట...

**కురవి జుల్జై 22(ప్రజా తీర్పు విలేఖరి)**



ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న అధ్యక్ష పదవి యువత కే దక్కడం శుభ పరిణామం.యువత మేలుకో...అభివృద్ధి సాధించుకో అని నిరూపించడానికే యువత కు పెద్ద పీట వేస్తూనే,మోదుగుల గూడెం గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని యువత అభిప్రాయం గా భావిస్తున్నారు.ఇక ఏన్నో సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ కీ సేవలు చేస్తూ ఈ రోజు న గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా అనబత్తుల ఉపేందర్ అందరి సహకారంతో అధ్యక్షులు గా ఎన్నికయ్యారు.అదే విధంగా అనబత్తుల ఉపేందర్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ శుభ సందర్భంగా నా వెన్నంటే ఉండి,ను కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్త కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.ఇంకా ఇలాంటి పదవులను ఏన్నో అధిరోహించాలని కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

## దాశరథి సాహిత్యం చిరస్మరణీయం...

### కళాశ్రీ, అధినేత గుండేటి రాజు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 22.**



నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని సాహితీ ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని, ఆయన సాహిత్యం చిరస్మరణీయంగా ఇప్పటికి తెలంగాణ హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు అన్నారు. బుధవారం దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దాశరథి సాహిత్యం పై చర్చ గోష్టి జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశ్రీ ప్రధాన అడ్మిన్స్ అయిత అనిత, మద్దెల సరోజన, లక్కరాజు శ్రీలక్ష్మీ, కటుకం కవిత, ములస్థం లావణ్య, ఓదెల గంగాధర్, మాడిశెట్టి శ్రీనివాస్, డా. శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ అనైతికం..సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్.

**నర్సంపేట టౌన్ జూలై 28 ప్రజా తీర్పు**



చెన్నారావుపేట మండలం రాహుల్ గాంధీ అరెస్ట్ అనైతికమని చెన్నారావుపేట పిఏసీఎస్ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ అన్నారు..నీట్ పేపర్ లీకేజీతో దేశ వ్యాప్తంగా విద్యార్థులు నష్ట పోయారని విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో నెట్టిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల పైన లాఠీ ఛార్జ్ చేసిన నేపథ్యంలో పార్లమెంట్లో ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ నష్ట పోయిన విద్యార్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన నాయకుడుని అరెస్ట్ చేసి రాక్షస ఆనందం పొందుతున్న ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించి విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ని తక్షణమే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని చెన్నారావుపేట మండల పీఏసీఎస్ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ డిమాండ్ చేసారు..



## రాహుల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల జూలై 22 (ప్రజాతీర్పు)**

ఇటీవల మృతి చెందిన కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి అంకం రాహుల్ కుటుంబాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. రాహుల్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.రాహుల్ మృతితో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.25,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే రాహుల్ సోదరి విద్యాభ్యాసానికి సంబంధించిన పూర్తి బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆమె చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. రాహుల్ కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.



## పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

**రామడుగు, జూలై 22 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ రామడుగు మండలంలో పలువురు నాయకుల కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. రామడుగు మండల కేంద్రానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరగడంతో ఆయన నివాసానికి వెళ్లిన సుంకె రవిశంకర్, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చాడ శేఖర్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి మనుగడ కాపాడడానికి యూనియన్ల విభేదాలను పక్కనపెట్టి పోరాటాలలో కలిసి రావాలి

- ఏఐటీయూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకట్ స్వామి విజ్ఞప్తి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 22**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో బుధవారం శాంతిఖని మైన్ మీద మంతెన రమేష్ అధ్యక్షతన మెడికల్ బోర్డు 17,18న నిర్వహించిన దానిలో కార్మికులకు జరిగిన అన్యాయానికి నిరసనగా శాంతిఖని మైన్ మీద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిట్టపల్లి వెంకటస్వామి, పాల్గొని కార్మికులకు సుదీర్ఘమైన ప్రసంగం చేస్తూ సింగరేణి కంపెనీలో 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో ఎన్నడూ లేనంతగా కనీవిని ఎరుగని కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేసే విధానాలను వెంటనే విరమించుకోవాలని నాటి కేసీఆర్ ప్రభుత్వాన్ని నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాం సింగరేణి కార్మిక సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం వల్లే సమస్త మనుగడ ప్రశ్నార్థకమవుతుందని తెలియజేశారు, గత 17 మాసాలుగా మెడికల్ బోర్డు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేసి కార్మికుల గొంతుకోసిందని అభిప్రాయపడ్డారు జూలై నెలలో 17 18 తేదీలలో జరిగిన మెడికల్ బోర్డు పారదర్శకత్వం లేకుండా నిర్వహించి కేవలం మీరు 24 మందిని మాత్రమే మెడికల్ ఇన్వాలిడేషన్ చేసి కార్మికుల కొంపలు ముంచారు యజమాన్య ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ప్రభుత్వాలను హెచ్చరించారు అలాగే సింగరేణిలో గౌరవ కిషన్ రెడ్డి గారు కేంద్ర బొగ్గు గనుల మంత్రివర్యులు తాడిచెర్ల (2)మైన్ ధరణి సింగరేణికి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఒప్పించడం స్వాగతిస్తూ బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కృషిని అభినందిస్తూ సింగరేణిలో సర్వే చేసిన 15 నూతన బొగ్గు గనులను ఓసీల ను సింగరేణికి అప్పగించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం ఒప్పించే విధంగా తెలంగాణ ఎంపీలు రాజకీయాల కచ్చితంగా సింగరేణి మనుగడ కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించి మెడికల్ బోర్డుకు అప్లికేషన్ పెట్టుకున్న వారిని మెడికల్ ఎగ్జామ్ నిర్వహించి ఇన్వాల్వ్ డెసిషన్ చేసి వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం పాటుపడాలని విజ్ఞప్తి చేస్తున్నాం, సింగరేణి సమ్మె నోటీసులో పొందుపరిచిన డిమాండ్లు అన్నిటిని కూడా పరిష్కరించడానికి సింగరేణి యాజమాన్యం పారిశ్రామిక సంబంధాలను దృష్టిలో ఉంచుకొని పారిశ్రామిక ప్రగతిని ఆకాంక్షిస్తూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నాం కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చిన ప్రభుత్వం తక్షణమే కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం సింగరేణి యువ కార్మిక సోదరులు పై వాస్తవాలను అర్థం చేసుకొని సింగరేణి మనుగడ కోసం కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం జరిగే ఉద్యమాలలో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి సింగరేణి భవిష్యత్తు కోసం పోరాటాల్లో కలిసి రావాలని అన్నివర్గాల కార్మికులకు అన్ని ట్రేడ్ యునియాన్ నాయకులకు ప్రపంచ కార్మిక వర్గ దృపదంతో పనిచేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బ్రాంచి ప్రచార కార్యదర్శి మంతెన రమేష్,ఫిట్ కార్యదర్శి రత్నం ప్రవీణ్,సహాయ కార్యదర్శి దాడి రమేష్, సీనియర్ నాయకులు రత్నం ఐలయ్య,మైన్స్ కమిటీ సభ్యులు సేఫ్టీ సభ్యులు టెంపుల్ కమిటీ క్యాంటీన్ కమిటీ వర్క్మెన్ ఇన్స్పెక్టర్లు కార్మికులు పాల్గొన్నారు




## బొద్దింకల బిగి పిడికిలి లో

పరీక్షా పత్రాలను లీకు జేసి
పసి బిడ్డల భవిత ను భగ్నం జేసి నోళ్లు
భారత మాతాకు జై అంటూనే –
మణిపూర్ లో మహిళా మాత ల మానం దీసి నోళ్లు
స్వదేశీ జాగరణ జపం జెస్తూ
దేశ సంపధను విదేశీ కంపెనీల కమ్మినోళ్లు
మత ఆదిపథ్యాల ముసుగు లో
మానవ హక్కుల్ని మంట గలిపి నోళ్లు
ఆదివాసులను అడివికి దూరం జెస్తూ
వనం వనరుల్ని "ఆధాని"కి
అప్ప గించి నోళ్లు
అరణ్యాలను నెత్తుటి మడుగుల ముంచి
మహోధ్యమాలనే మాయం జేసి నోళ్లు
కార్మిక చట్టాలన్ని కాలరాసి
ప్రభుత్వ సంస్థ లన్ని ప్రైవేటోని కాడ పాత రేసి నోళ్లు
సనాతన ధర్మాల ఉన్మాదపు మనువులు గా
సామాజిక ఉద్యమాలకు సమాధులు కట్టి నోళ్లు
సదువు కుంటే బొట్టు అంటూ –గాజులు గ్యారంటీ నంటూ
సదువు కునే పట్టాలను బుట్ట దాఖలు జేసే టోళ్లు
ఇప్పుడు బొద్దింకల బిగి పిడికిలి తో
బొందలు తోడు కుంటున్నరు
కాక్రోచుల ఖధనం తో
లోక్ సభలో మోగేను గంటలు
సనాతన సన్నాసుల కిక
ఇవే చివరి చితి మంటలు
రాజ దాని నగరం లో గర్జించిన యువ లోకం
లాఠీ దెబ్బల రక్తం తో
రగులు తొంది భరత లోకం
కవిత : ఏబూసి....



**(సీజెపి యువత ఆందోళన పై కేంద్రం అణిచివేతను నిరసిస్తూ )**
**22/07/2026**

## ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి:

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 22.**



బుధవారం జగిత్యాల జిల్లా రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుల్లపేట గ్రామంలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పనులను, అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను తనిఖీ చేశారు. భవన నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలతో చేపట్టాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అన్ని సౌకర్యాలతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పల్లె దవాఖాన నూతన భవనం మరియు వీవో (వి ఓ) భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దావఖానా భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీవో భవనాలను అన్ని మౌలిక వసతులతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న ప్రతి ప్రభుత్వ భవనం దీర్ఘకాలం ఉపయోగపడేలా నిర్మించాలని, పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, , స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నా తెలంగాణ కోటి రతనాల వీణ...

- దాశరథి పోరాటం స్ఫూర్తి దాయకం...
- బిఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి నాయక్...

**కురవి జుల్జై 22(ప్రజా తీర్పు విలేఖరి)**




తెలంగాణ ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్యులు నిజాంను ఎదురించిన పోరాట పటిమను,తన గళాన్ని, కలాన్ని తెలంగాణకు దారపోసిన వారి త్యాగాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని బి ఆర్ ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి నాయక్ అన్నారు.బుధవారం నాడు కురవి మండల కేంద్రం నాగార్జున విద్యాలయంలో దాశరథి జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ... నిజాం నిరాంకుశత్వాన్ని నిరసించిన దీశాలి దాశరథి కృష్ణమాచార్యులు అని అన్నారు.నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ ఆంధ్ర మహాసభల్లో చురుకైన పాత్ర పోషిస్తూ చెరసాలను సైతం చిరునవ్వుతో స్వీకరించిన తొలిదశ తెలంగాణ ఉద్యమ ధీరుడు అని కొనియాడారు.ఈ కార్యక్రమం లో నాగార్జున విద్యాలయం ప్రిన్సిపాల్ రవి,సామాజిక ఉద్యమకారులు, పాత్రికేయులు పెద్దబోయిన శ్రీశైలం యాదవ్,బిఆర్ఎస్ యూత్ మండల నాయకులు బానోత్ రఘు,డోర్నకల్ నియోజకవర్గ బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ పేర్ల గణేష్,కొల్లూరి గణేష్, వెంకన్న,వెంకట రమణ,ఉపాద్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యకు పెద్దపీట.. బక్కచింతలపాడులో ఎస్పీ రోహిత్ రాజు పాఠశాల భవనం ప్రారంభం

**(జక్కుల ఫాల్గుణ, ప్రజా తీర్పు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) జూలై 22**



చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామంలో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో నిర్మించిన నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలు పంపిణీ చేసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులతో సమావేశమై విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విద్యే ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దవచ్చన్నారు. చదువుతో పాటు క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, పాఠశాలల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ, నైతిక విలువలు, హాజరు శాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం లేదా ప్రమాదాలు సంభవించినప్పుడు మూఢనమ్మకాలను నమ్మకుండా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సందేశమిచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, ఎస్బీ–2 ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ, ఎంఈఓ రమణ, సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నీట్ యూజీ పేపర్ లీక్‌తో మోడీ ప్రభుత్వానికి మూడింది





- ప్రశ్నాపత్రం లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి..
- విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ హోం మంత్రి పదవి నుంచి తప్పుకోవాలి..
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 22.**

ప్రతి ఏటా నిర్వహించే నీట్ యూజీ పరీక్ష పత్రం లీకేజీతో కేంద్రంలో ని మోడీ ప్రభుత్వానికి మూడిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు.ఢిల్లీలో రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దేశ వ్యాప్తంగా ప్రతి యేటా నిర్వహించే నిట్ పరీక్ష కు సుమారుగా20 లక్షలకు పైగా మందికి పైగా విద్యార్థులు హాజరు అవుతారని పేర్కొన్నారు. ఈఏడాది నీట్ యూజీ పరీక్షలకు 22 లక్షల, 79వేల 743మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 19 లక్షల 99వేల,895 మంది విద్యార్థులు విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారని వివరించారు.తెలంగాణ రాష్ట్రం నుంచి 73,084 మంది విద్యార్థులు హాజరు అయ్యారని పరీక్ష పత్రం లీకేజీ వలన ఇప్పటి వరకు 12మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్.. వారి తల్లిదండ్రుల కళలను సహకారం చేసుకునే ఈపరీక్షను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్రం ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షను పారదర్శకంగా నిర్వహించానికి ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరీక్ష ప్రశ్న పత్రాలు పల్లి, బఠాణీ అమ్మినట్లు ప్రశ్న పత్రాలను అమ్ముకున్నారని మంత్రి అడ్లూరి ఆరోపించారు. సోషల్ మీడియా , టెలిగ్రామ్ ద్వారా లీక్ అయిన ప్రశ్నలు పిడిఎఫ్ రూపంలో టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు విక్రయించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఆధారాలు సేకరించిందని మంత్రి అడ్లూరి అన్నారు. నీట్ యూజీ ప్రశ్నపత్రాల రూపకల్పన, అనువాద ప్రక్రియ, పరీక్షా ప్యానెల్‌లోని సబ్జెక్ట్ నిపుణులు,కోచింగ్ నిర్వాహకులు ఈ లీకేజీలో కీలక పాత్ర పోషించినట్లు బీజేపీ జేబు సంస్థగా చెప్పుకునే సీబీఐ దర్యాప్తులో తేల్చిందని వివరించారు. ఢిల్లీ, జైపూర్, పుణే, లాతూర్, గురుగ్రామ్ తదితర ప్రాంతాల్లో లెక్చరర్లు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, దళారులను సీబీఐ అరెస్ట్ చేసింది నిజం కదా అని మంత్రి ప్రశ్నించారు. సీబీఐ దర్యాప్తులో పరీక్ష పత్రం లీక్ అయినట్లు తెలిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీట్, యూజీ పరీక్ష పత్రం లీక్ కావడంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్-యూజీ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీవిషయంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎందుకు బాధ్యత వహించడం లేదో సమాధానం చెప్పాలన్నారు.ప్రశ్న పత్రం లీకేజీపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేపడితే కేంద్రంలోని మోడీ సర్కార్ విద్యార్థులపై లాఠీలు విరగకొడుతుందని నీట్ యూజీ పరీక్ష పత్రాల లీకేజీ పై పార్లమెంటులో చర్చ జరగాలని కాంగ్రెస్ మిత్ర పక్షాలు పట్టు పట్టినప్పటికీ ఎందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం లేదని మంత్రి ప్రశ్నించారు. గడిచిన రెండు రోజులుగా పార్లమెంట్ ను వాయిదా వేశారు తప్ప కేంద్ర ప్రభుత్వం చర్చకు మాత్రం అంగీకరించడం లేదని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఆధారాలు చూపించి అరెస్టులు చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయడం లేదని ఆయన అన్నారు.ఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేసిన ధర్నా సందర్భంగా ఢిల్లీ పోలీసులు కేంద్ర ప్రభుత్వం లాఠీ చార్జి చేయడానికి బాధ్యత వహిస్తూ ప్రధానం ప్రధానమంత్రి మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . కాంగ్రెస్ పార్టీ ధర్నా నిర్వహించిందని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రధానమంత్రి ఇంటి ముందు ధర్నా చేస్తున్న ప్రతిపక్షాలపై ప్రభుత్వం దాడులు చేయడంతో రాహుల్ గాంధీ గాయపడ్డారని మంత్రి తెలిపారు.బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గలమెత్తుతున్న రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కావాలని దాడి చేసిందన్నారు. సంవత్సరాల తరబడి కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవస్థ నాశనం చేస్తోంది. ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల కడుపుకోత ఏలా తీరేది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పెద్దలు చెప్పాలని అన్నారు.ఎన్టీఏ పరీక్ష విధానాల్లో పారదర్శకత తెచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని,కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి పార్లమెంటులో పరీక్ష పత్రాల లీకేజీపై చర్చకు కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని డిమాండ్ చేస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ సమీండ్ల వాణి , జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్, బండ శంకర్,నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.



## వేములవాడ KDCC బ్యాంక్ నుండి డ్రా చేసిన 3 లక్షలు స్వహా

**(నారుకట్ల మదు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 22**

నాగరాజు అనే వ్యక్తి బ్యాంక్ నుండి డ్రా చేసి బండిలో పెట్టొకొని ఇంటికి పోయి బైటకు వచ్చి చూసేసరికి బండిలో ఉన్న డబ్బు మాయం. డ్రా చేసిన సమయంలో చూసి వ్యక్తులే వెంబడించి డబ్బులు స్వహా. లబోదిబో మంటూ పోలీసులకు పిర్యాదు. ఆ ప్రాంత సి సి కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు.



## భూ సమస్యల పరిష్కారానికే భూ రీ సర్వే

- జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బిఎస్.లత

**( ఎలుక భగవాన్ యాదవ్,ప్రజాతీర్పు, ఎండపల్లి) జులై 22 :**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత పేర్కొన్నారు. బుధవారం ఎండపల్లి మండలంలోని సూరారం గ్రామంలో నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ భూములపై దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను భూ రీ సర్వే ద్వారా పరిష్కరించి, పాత రికార్డుల్లో ఉన్న పొరపాట్లను సరిచేసి, భూములకు సరైన హద్దులు ఏర్పాటు చేసి, నూతనంగా డిజిటలైజేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేస్తారని తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలతో భూ రీ సర్వే రోజు హాజరై, సిబ్బందికి సహకరించి తమ భూముల సమస్యలపై శాశ్వత పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎ.అనిల్ కుమార్, గిర్దావర్ టి. అన్వేష్, గ్రామ సర్పంచ్ కోడిపెల్లి కొమురమ్మ- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- నీట్ పేపర్ లీకేజీ నిందితులను అరెస్టు చేయాలి
- కాంగ్రెస్ నేతలు కోరుట్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

**కోరుట్ల జూలై 22 (ప్రజాతీర్పు)**



నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీకి బాధ్యులైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య, తెలంగాణ రాష్ట్ర వెలుమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి, బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. జాతీయ స్థాయిలో పరీక్షల నిర్వహణలో వరుసగా చోటు చేసుకుంటున్న వైఫల్యాల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, ధర్మారం సర్పంచ్ దొడ రంజిత్ రెడ్డి, అయిలాపూర్ సర్పంచ్ ద్యావనపల్లి రామకృష్ణ, చిన్నమెట్పల్లి సర్పంచ్ రహీం, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ అరెస్టు ఖండన.. నీట్ లీక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్

- కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్
- ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన
- పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్

**( శరత్ రావు బ్యూరో కరీంనగర్, ప్రజాతీర్పు ) జులై 22**

న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడాన్ని కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ తీవ్రంగా ఖండించారు. ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తు మల్లేష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేసే ప్రయత్నం ఎంతమాత్రం సహించేది కాదని స్పష్టం చేశారు. అలాగే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ వైఫల్యానికి పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సత్తు మల్లేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఏ శక్తినైనా కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించదని, ఈ అంశంపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గ్రామంలో ఇంటింటికి ఐదు మొక్కలు" కార్యక్రమం ప్రారంభం

- ప్రతి ఇంటికి పండ్ల, నీడ, పూల మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్ దాసరి రమేష్..

**నర్సంపేట టౌన్ జూలై 22 ప్రజా తీర్పు**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఖానాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో "ఇంటికి ఐదు మొక్కలు" పంపిణీ కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించాం. గ్రామంలోని ప్రతి ఇంటికి 5 మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నాం. ఇందులో పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు,పూల మొక్కలు ఉన్నాయి. హరితహారం లక్ష్యాలకు అనుగుణంగా మన గ్రామాన్ని పచ్చదనంతో నింపడమే లక్ష్యం. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి కుటుంబం తీసుకోవాలని కోరాం. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్,సభ్యులు గుండ్లపల్లి మంజుల ఫీల్డ్ అసిస్టెంట్ యాకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూడు రోజుల క్రితమే డీఎస్ఎఫ్ఐకి రాజీనామా చేశా: రామ్ చరణ్

**(జక్కుల ఫాల్గుణ, ప్రజా తీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) జూలై 22**



డీఎస్ఎఫ్ఐ సంఘానికి తాను మూడు రోజుల క్రితమే రాజీనామా చేశానని, గత ఆరు నెలలుగా ఆ సంఘం కార్యకలాపాల్లో లేనని విద్యార్థి ఉద్యమ నాయకుడు రామ్ చరణ్ తెలిపారు. తనను సస్పెండ్ చేసినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఎస్ఎఫ్ఐలో పనిచేసి అనంతరం డీఎస్ఎఫ్ఐలో చేరానని, అయితే ఆరు నెలలుగా సంఘం పనులకు దూరంగా ఉన్న విషయాన్ని రాష్ట్ర బాధ్యులకు ముందుగానే తెలిపానన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారానికి క్రమశిక్షణతో పనిచేశానని, జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుంటూ ఉద్యమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తనపై గతంలో వచ్చిన ఆరోపణల విషయంలో రాష్ట్ర కమిటీ సరైన స్పందన ఇవ్వలేదని, నిజంగా తప్పు చేసి ఉంటే అప్పుడే చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. ఇప్పుడు సస్పెన్షన్ పేరుతో ప్రచారం చేయడం సరికాదని, ముందు "డి" అక్షరం పెట్టినంత మాత్రాన ఎస్ఎఫ్ఐ భావాలు రావని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తనకు డీఎస్ఎఫ్ఐ సంఘంతో ఎలాంటి సంబంధం లేదని రామ్ చరణ్ స్పష్టం చేశారు

## దేవుడికి ఇచ్చిన విరాళం వెనక్కి ఇస్తారా?

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 22**



వేములవాడ రాజరాజేశ్వరస్వామికి భక్తులైన దంపతులు తమ దగ్గరున్న రూ.7,01,116.. రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళంగా అందించారు. మా నాన్నకు మతిస్థిమితం సరిగ్గా లేదు. అందుకే ఉన్న డబ్బంతా గుడికి సమర్పించారు. అమ్మానాన్నల పోషణ కోసం దాన్ని తిరిగివ్వండని ఏడుగురు కుమార్తెల్లో కొందరు అధికారులకు తెలిపారు. దంపతుల అంగీకారంతోనే విరాళం స్వీకరించామని, ఒకసారి స్వామికి సి సమర్పించాక వెనక్కి ఇవ్వలేమంటూ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేశారు. ఏమీ చేయలేక వారు వెనక్కి వెళ్లారు.

# మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభం

- ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజ్‌గిరి, మేడ్చల్ జిల్లా) జూలై 22:**



మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈరోజు పలు అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా గౌతమ్ నగర్ డివిజన్‌లోని సఫిల్‌గూడ రోడ్డు నుండి గౌతమ్ నగర్ చౌరస్తా వరకు రూ.77 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో, మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, స్థానిక కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం మల్కాజ్‌గిరి సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న శ్రీ వారాహి -- శ్రీ ప్రత్యంగిరా సహిత హోమం మరియు వారాహి మాత నవరాత్రి మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, మల్కాజ్‌గిరి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. తదుపరి వాజ్‌పేయి నగర్‌లో కొనసాగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి (=ఖదీ) నిర్మాణ పనులను స్థానిక కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే కళాశాల ప్రహరీ గోడపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, స్థానికంగా ఉన్న ఇంటర్మీడియట్ డీఐఓ కార్యాలయాన్ని ఖాళీ చేసి తరగతి గదుల కోసం కేటాయించడం, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మల్కాజ్‌గిరి సర్కిల్ డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, మాజీ కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్, జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, మల్లేష్ యాదవ్, అనిల్, కాటంరాజు, శ్రీనివాస్ గౌడ్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, హేమంత్ పటేల్, నర్సింగ్ రావు, విజయ్ రెడ్డి, రఘుపతి రెడ్డి, ఫరీద్, బాలకృష్ణ, జనార్ధన్, రాజేష్, శ్రీకాంత్ యాదవ్,ఈశ్వర్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు, కళాశాల సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## తాండూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్ ) జులై 22**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న తాండూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య,ఎస్ఐ ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు వందనాన్ని స్వీకరించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,రిసెప్షన్ సెంటర్‌లోని సిబ్బందితో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,అప్‌లోడ్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ దేవయ్య,ఎస్ఐ ప్రసాద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని,సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంతో పాటు సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో చట్టాలపై,సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై,సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన,కల్పించాలని,మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని,తెలిపారు. అలాగే రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్,సీటు బెల్టు ధరించడం యొక్క ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు,గ్రామపంచాయతీలు, జాతీయ రహదారి ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీలలో ఏసీపీ కిరణ్ కుమార్,సీఐ,దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ పక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

**నర్సంపేట టౌన్ జూలై 22 ప్రజా తీర్పు**

ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిబంధనకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేయాలని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మిరామానంద్ బీఎల్ఓ మరియు బీఎల్ఏ లకు సూచించారు.. బుధవారం నాడు నర్సంపేట పట్టణంలోని 20వ వార్డులో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీరామోజు రోజా రాణి, నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ తో కలిసి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ వార్డులో బీఎల్ఓ మరియు బీఎల్ఏ లు నిబంధనలకు అనుగుణంగా ఓటరు వివరాలను ఎలాంటి పొరపాటు లేకుండా నమోదు చేయాలని అవసరమైన సవరణలు సకాలంలో చేపట్టాలని సూచించారు.. ప్రతి అర్హత కలిగిన ఓటరుకి పూర్తి సహకారం అందించి ఓటు హక్కు పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏ లు, తదితరులు పాల్గొన్నారు..

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

- ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోలోజు రంజిత్, బ్రాహ్మణపల్లి యుగేందర్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 22**



ఢిల్లీలో యువత, విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయువు ఉపయోగించి బలప్రయోగం చేయడాన్ని ఖండిస్తూ, నీట్ - యుజి, యుజిసి - నెట్ వంటి పరీక్షలలో ప్రశ్నపత్రాల లీకేజీలు, మూల్యాంకన వివాదాలు సహా అనేక తీవ్రమైన అక్రమాల నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్ టిఏ )ని రద్దు చేయాలని రంజిత్, యుగంధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలోజు రంజిత్, బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ పాలనలో విద్యాశాఖ వ్యవస్థ పూర్తిగా బలహీనపడిందని, ధర్మేంద్ర ప్రధాన్ అవినీతి వల్ల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసమర్థంగా, పనికిరానిదిగా మారి విద్యార్థులు పట్ల శాపంగా మారిందని దుయ్యబట్టారు. "కుంభకోణాలు" జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, లక్షలాది మంది విద్యార్థుల ఏళ్ల తరబడి కఠోర శ్రమకు కేంద్ర బీజేపీ ప్రభుత్వ దృష్టిలో ఏమాత్రం విలువ లేదని పేర్కొన్నారు. తక్షణమే ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ తోపాటు ఎన్ టిఏ ను రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఢిల్లీలో యువత, విద్యార్థుల నిరసనలపై పోలీసులు జరిపిన లాఠీచార్జీని, బాష్పవాయువు ప్రయోగాన్నిఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని, నీట్ పేపర్ లీకేజీలు, నిరుద్యోగం తదితర విద్యా వ్యవస్థ సంక్షోభాలపై విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు చేపట్టిన శాంతియుత నిరసనలను అణచివేయడం దుర్మార్గమని, మోదీ ప్రభుత్వం నియంతృత్వం ఇలాగె కొనసాగిస్తూ యువత, విద్యార్థులు తిరుగుబాటు తప్పదని రంజిత్,యుగేందర్ హెచ్చరించారు.



## ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నిరసన

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన నాయకులు

**(జక్కుల పాల్గుణ, ప్రజా తీర్పు పినపాక) జూలై 22**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. వరుస పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతోందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై నమోదైన కేసులు, అరెస్టు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఆరోపిస్తూ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల పరిరక్షణ, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పా ర్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో దిశా కమిటీ అధ్యక్షుడు మద్దెల సమ్మయ్య, ఎస్సీ సెల్ నాయకుడు ప్రసాద్, సర్పంచులు అలివేలు, స్వప్న, అనిత, వెంకటేశ్వర్లు, మట్ట బాబురావు, చందర్రావు, ఉప సర్పంచులు సందీప్, శిరీష, రామ్మోహన్, నవీన్, అచ్చ నవీన్, కాంగ్రెస్ నాయకులు కంది సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, హేమంత్, మహిళా విభాగ ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శాంతియుత నిరసన తెలిపితే విద్యార్థులపై లాఠీ-చార్జిలా?

- రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం... మంత్రి పొన్నం ప్రభాకర్


**హుస్నాబాద్ జులై22 ప్రజా తీర్పు రవీందర్**

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఎంపీలు చేపడుతున్న శాంతియుత నిరసన ను అడ్డుకొని అరెస్టు చేయడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నీట్ పేపర్ లీకేజీకి కారణమైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దీనిపై హోం మంత్రి స్పందించాలని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ తో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లీకేజీ కి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లీకేజీ ఘటనలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. విద్యార్థుల లాఠీ ఛార్జ్ పై హోంమంత్రి సంఘీభావం తెలుపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. లాఠీ చార్జీకి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని, గాయపడ్డ వారికి మంచి వైద్యం అందించాలన్నారు. రాహుల్ గాంధీతో సహా వందమంది ఎంపీలు ధర్నా చేస్తుంటే వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ఇంటి ముందు నిరసన చేస్తే అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకించారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ నేతలు
- కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: డిసిసి చీఫ్ డాక్టర్ మేడిపల్లి సత్యం
- గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శాంతి యుత నిరసన
- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 22**



లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ ను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ తో ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ రోడ్డులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతి యుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నిరసన దీక్షను ప్రారంభించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే పిసిసిఎస్సి విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్ బాబు, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య తో పాటు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు నామినేటెడ్ పదవులలో కొనసాగుతున్న ముఖ్య నేతలు మార్కెట్ కమిటీల, సహకార సంఘాల చైర్మన్లు సర్పంచులు బ్లాక్ మండల పట్టణ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరైనారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దేశంలో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తే ఆ పరీక్ష లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే క్యాబినెట్ నుండి తొలగించాలని, ఈ లీకేజీ అంశంపై పార్లమెంటులో సుదీర్ఘమైన చర్చ జరపాలని మొన్న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు శాంతియుత నిరసన చేపడితే ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ప్రభుత్వశీ విద్యార్థులు యువతపై విచక్షణా రహితంగా దాడులు చేయించారని ఆరోపించారు. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులు, ప్రధాని ఇంటి ముందు బైఠాయించి జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువతపై దాడులు చేసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, నీట్ పేపర్ లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి అమిత్ షా క్షమాపణ చెప్పాలి నరేంద్ర మోడీ పదవి నుండి తప్పుకోవాలి అని డిమాండ్ చేస్తే రాహుల్ గాంధీ తో పాటు ఇతర నాయకులపై దాడులకు పాల్పడి అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. ఎంతోమంది తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను చదివిస్తే విద్యార్థులు నిద్రాహారాలు మానేసి ఉజ్వల భవిష్యత్తు కోసం తన కలలను నిజం చేసుకోవడానికి నీట్ పరీక్షలు రాస్తే ఆ పేపర్ లీకేజీకి పాల్పడి ఎంతో మంది విద్యార్థుల చావులకు కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయించాలని, చేతకాని ప్రధాని నరేంద్ర మోడీ పదవి నుండి తప్పుకోవాలి దేశ హోంమంత్రి అమిత్ షా ఈ దేశానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టిపిసిసి పిలుపు మేరకు విద్యార్థులకు మద్దతుగా కరీంనగర్ పట్టణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో విద్యార్థి నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేంతవరకు మా ఉద్యమం, ఆందోళన కొనసాగుతుందని అన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

- రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేద్దాం
- రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా అధికారులు చూడాలి
- ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ జులై 23 (ప్రజా తీర్పు)**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని.. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రవాణా శాఖ, పోలీస్ శాఖ, ఆర్అండ్ బీ అధికారులు, ఆర్టీసీ, ఎన్ హెచ్ఏఐ పీడీ భరద్వాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రత కమిటీ చైర్ పర్సన్ గా కలెక్టర్ మాట్లాడారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి, అక్కడ స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వరద నిలిచే రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి.. నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి దెబ్బతిన్న రహదారులకు మరమ్మత్తులు చేయాలని పేర్కొన్నారు. వాహనదారులకు తెలిసేలా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, కల్వర్టులకు పసుపు రంగు వేయించి హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలన్నారు.

### నగరంలో లైటింగ్ వ్యవస్థ మెరుగుపరచాలి

కరీంనగర్ నగరపాలక పరిధిలో ప్రధాన రహదారులపై లైటింగ్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అవసరమైన చోట లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు.

విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు సైతం రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు, రోడ్డు ప్రమాదాల నివారించేందుకు నిఘా, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు , సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్ ఎన్ఫోర్స్మెంట్ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ ప్రక్రియ మొత్తం 60 రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీస్ శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వారి కోసం అందిస్తున్న టోల్ ఫ్రీ నెంబర్ 1033 గురించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడంతోనే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత నెల కంటే ఈసారి రోడ్డు ప్రమాదాలు తగ్గాయని.. హిట్ అండ్ రన్, ఈ చలాన్ కేసుల గురించి వివరించారు. వర్షాకాలంలో వాహనాల మెయింటెనెన్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులకు సీపీ సూచించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ బొమ్మ–పద్మా నగర్ జంక్షన్, నీరు నిలిచే, ప్రమాదాలు జరిగే ప్రాంతాల గురించి చర్చించారు. పలు ప్రమాదాల కేసులు వివరించారు. అంతకుముందు కరీంనగర్– వరంగల్ జాతీయ రహదారి పనుల గురించి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వివరించారు. సుమారు 95 శాతం వరకు పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కోరుట్ల గడి గుర్జు వీఎల్‌టీ రద్దు చేయాలి:

### మంత్రిని కోరిన ఎమ్మెల్యే సంజయ్

**కోరుట్ల జూలై 22 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పట్టణంలోని గడి గుర్జు వీఎల్‌టీ (యూ)ను వెంటనే రద్దు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సంబంధిత రాష్ట్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడి గుర్జు వీఎల్‌టీ కారణంగా స్థానిక ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలు, ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని వీఎల్‌టీని రద్దు చేసే దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారి ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



## మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్

**జమ్మికుంట, జూలై 22 ప్రజాతీర్పు**

పట్టణ పరిధిలోని సువర్ణ ఫంక్షన్ హాల్‌లలో బుధవారం నిర్వహించిన కండెం వంశీ కుమార్తె క్రిషిక శ్రీ, కుమారుడు క్రిశాంక్ రాజ్ ల మొదటి పుట్టినరోజు వేడుకలకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్నారులను ఆశీర్వదించి, వారికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చందా రాజు, లెంకలపల్లి శరత్, చుంచు శివలతో పాటు పలువురు స్థానిక నాయకులు, ముఖ్య ప్రముఖులు, కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల డిమాండ్

**మంథని, జూలై-22 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, జాతీయ పరీక్షల సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించడం, నీటి ఫిరంగులు ప్రయోగించడం, రబ్బరు బుల్లెట్లు ఉపయోగిస్తూ ఉద్యమాన్ని అణిచివేయడం అత్యంత దారుణమైన చర్య అని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ జరిగిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకుండా కొనసాగడం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యాశాఖ మంత్రికి మద్దతుగా నిలవడం విచారకరమని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు, యువత గత కొంతకాలంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రధానమంత్రి స్పందించకపోవడం ఆశ్చర్యకరమని తెలిపారు. ధర్మం తప్పిన ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు, నీట్ విద్యార్థుల ఆత్మహత్యలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, నాయకులు అఖిల్, మహేందర్, రణధీర్, మనోజ్, సాయి కిరణ్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్‌లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ "

- కేంద్రమంత్రి కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్
- రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ శ్రేణులు.

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 22**

ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళన బాటలోనే, కరీంనగర్‌లోనూ కాంగ్రెస్ నేతలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ కార్యాలయం ముట్టడికి యత్నించడంతో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కరీంనగర్ పార్లమెంటు కార్యాలయం వైపు దూసుకొచ్చిన కాంగ్రెస్ శ్రేణులను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, కేంద్ర మంత్రి కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా స్పందిస్తూ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నిరసనలను వ్యతిరేకిస్తూ బీజేపీ శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఉనికి కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తోందని గంగాడి కృష్ణారెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని రాహుల్ గాంధీ రాజకీయ లబ్ధి కోసం దేశ వ్యతిరేక శక్తులతో కలిసి ఆందోళనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన చిల్లర పార్టీగా మారిన కాంగ్రెస్ , బిజెపిని ఎదుర్కోలేక అశాంతి అల్లర్లు సృష్టించాలని దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు. నీట్ పరీక్ష విషయంలో తప్పులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం రీ–ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించినప్పటికీ, ఢిల్లీలో విధ్వంసకర ఆందోళనలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన పేరుతో అరాచక రాజకీయాలకు పాల్పడటం హేయనీయమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ కుట్రపూరిత ఆందోళనలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో బీజేపీ ముందుకు వెళ్తుందని, ఇలాంటి చౌకబారు బెదిరింపులకు బీజేపీ కార్యకర్తలు భయపడరని, బీజేపీతో పెట్టుకుంటే తడాఖా చూపిస్తామని, ఖబర్దార్ అని గంగాడి కృష్ణారెడ్డి హెచ్చరించారు.

## నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం

### ఐఓసీలో ముందస్తు ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**హుస్నాబాద్ జులై22 ప్రజా తీర్పు రవీందర్**



హుస్నాబాద్ ఐఓసిలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ 7 మండలాలకు సంబంధించి వానకాలం 2026 ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కొనేందుకు ఆయా శాఖల అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశ ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కొనేందుకు నిర్వహించే సన్నాహక సమావేశానికి 3 జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామపంచాయతీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులందరికీ వారి యొక్క యాక్షన్ ప్లాన్ తెలపడం కోసం ప్రొజెక్టర్ ఏర్పాటు చెయ్యాలని, జిల్లాల వారిగా అధికారులకు సిట్టింగ్, 3 జిల్లాలు 7 మండలాల వారికి వాటర్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఉదయం నుండి సాయంత్రం దాకా కొనసాగుతుందని మధ్యాహ్నం లంచ్ ఏర్పాటు సైతం చెయ్యాలని, ఈ కార్యక్రమం ఫర్నిచర్, మైక్ సెట్టింగ్, నిరంతర విద్యుత్, టీ స్నాక్స్, డ్రింకింగ్ వాటర్, మధ్యాహ్న భోజనం ప్రతిదీ ఎక్కడ కూడా లోటు కాకుండా చూసుకోవాలనీ ఆర్డీఓ రామ్మూర్తి ని ఆదేశించారు.



## చిగురుమామిడి నిధులు మంజూరు రూ. 35 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టూతున్న సర్పంచ్

**హుస్నాబాద్ జూలై22 ప్రజా తీర్పు రవీందర్**

చిగురు మామిడి గ్రామపంచాయతీ కి ఎం జి, ఎన్ ఆర్, ఈజీ సీఎస్ నిధులు రూ. 35 లక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని– శివప్రసాద్ తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని పలు వార్డుల్లో పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రాజన్న పల్లెలో సీసీ రోడ్డు మరియు సీసీఐ ఆఫీసు వద్ద సీసీ రోడ్డుకు, ఎంపీడీవో ఆఫీసు నుండి కస్తూరిబా వరకు సీసీ రోడ్డు, ఎస్సీ కాలనీ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి, గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం కేంద్రం నిధులచే పన్యాల వాడకు, దుర్గమ్మ వాడలోని మురికి కాలువ నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాశ బోయిన విజయలక్ష్మి – రాజు, వార్డు సభ్యులు పోతరవేణి అనిల్, నాగెల్లి హరీష్, దున్నపోతుల సౌందర్య, శ్రీనివాస్, వేల్పుల భాగ్య, రాకం అంజమ్మ, చెరుకు సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## 120 కిలోమీటర్ మైలేజి రన్నింగ్ స్టాఫ్ కు ఇవ్వాలనిడిమాండ్

### బెల్లంపల్లి క్రూ లాబీ ఎదుట రైల్వే లోకో పైలట్ధర్నా

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 22**




దక్షిణ మధ్య రైల్వే లో పనిచేస్తున్న రన్నింగ్ స్టాఫ్ కు 120 కిలోమీటర్ మైలేజ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో లోకో పైలట్స్ బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి క్రూలాబీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మన్ ఎస్ నాగరాజు, సెక్రెటరీ జి సాంబశివుడు మాట్లాడారు. సిగ్నల్ నుంచి సిగ్నల్ ఆఫ్ చేసిన వెంటనే మైలేజి ఇవ్వాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైల్వేవ్యవస్థకు మూలకారణమైన లోకో పైలట్ షిఫ్ట్ నెలలో 4 కాకుండా రెండుకు తగ్గించాలని, 36 గంటల్లో పైలట్స్ హెడ్ క్వార్టర్స్ కువచ్చే విధంగా నిబంధనలు కేంద్ర ప్రభుత్వం అమలు పర్చాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో పైలట్స్ 70 గంటలు పనిచేయాల్సి వస్తుందని లోకో పైలట్స్ పై కేంద్ర ప్రభుత్వం అధిక పని భారం వెూపుతుందని, పేర్కొన్నారు. బెల్లంపల్లి, బల్లార్షా రామగుండం, పంద్రపాణి రైల్వే గూడ్స్ డిపోల్లో గల రన్నింగ్ రూమ్స్ ను ఆధునికరించి అభివృద్ధిపర్చాలని, వాటిలో మహిళా లోకో పైలట్లకు తగు సౌకర్యాలు కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోకో పైలట్స్ 25 శాతం కిలోమీటర్ ఫర్ అలవెన్స్ చె ల్లించాలని వారు డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలట్లకు డిపోలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సౌత్ సెంట్రల్ మద్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, సీనియర్ నాయకుడు రవీందర్ లు ఇచ్చిన పిలుపులో భాగంగా బెల్లంపల్లి లో నిర్వహించిన ధర్నా లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దీర్ యూనియన్ కోశాధికారి షోకేష్ మీనా,నాయకులు సీహెచ్ హేమ, పీ , ఎస్ షా, సాగర్ భట్, ధీరజ్ అగర్వాల్, వివేక్, రామ్ లఖన్ లాల్ పెద్ద సంఖ్యలోకో పైలట్ పాల్గొన్నారు.



## “అనుమతి లేకుండా ఇసుక తరలింపు - టేకులపల్లి పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ ట్రాక్టర్ సీజ్”

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) జులై 22**

టేకులపల్లి :మండలంలో అక్రమ ఇసుక తరలింపు పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈరోజు సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో సింగ్య తండా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మూడ్ తండాకు చెందిన ఎల్లబోయిన కృష్ణ అనే వ్యక్తి జేత్య తండా సమీపంలోని తెల్ల వాగు నుండి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ట్రాక్టర్ లో ఇసుకను టేకులపల్లికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వెంటనే ట్రాక్టర్ ను సీజ్ చేసి సంబంధిత వ్యక్తి పై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సహజ వనరులను దోచుకోవడం చట్టరీత్యా నేరమని ఎస్ ఐ హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, మండలంలో తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. లిఎస్ ఐ,తెలిపారు.

## సమాచార హక్కు సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి శ్రీనివాస్‌కు.. మంత్రి శ్రీధర్ బాబు అభినందనలు

**మంథని, జూలై-22 (ప్రజాతీర్పు)**



మంథని పట్టణానికి చెందిన రామడుగు సాయి శ్రీనివాస్ సమాచార హక్కు సంస్థ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, సాయి శ్రీనివాస్ ప్రజాసేవా దృక్పథంతో పనిచేసే వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేసే ఆయనకు ఈ బాధ్యతలు రావడం సంతోషకరమన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సాయి శ్రీనివాస్ నియామకం ద్వారా జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలుకు మరింత ఊతం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకుగా పనిచేయాలని ఆకాంక్షించారు.



## పాత వారికే ప్రాధాన్యం.. కొత్త వారికి నిరాశ

- మంత్రి పొన్నంకు మహిళా సంఘాల ఫిర్యాదు
- పాఠశాల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**హుస్నాబాద్ జులై 2 2 ప్రజా తీర్పు రవీందర్**

చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ వ్యవహారంపై మహిళా సంఘాల సభ్యులు బుధవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, అనూష, భాగ్య, నీల, స్వరూపా, లక్ష్మీ ఫిర్యాదు చేశారు. మహిళా సంఘాల సభ్యుల కథనం ప్రకారం.. మధ్యాహ్న భోజన నిర్వహణ అంశం కోర్టు వివాదంలో ఉందని ప్రధానోపాధ్యాయురాలు గ్రామసభలో సర్పంచ్, గ్రామస్థుల సమక్షంలో తప్పుడు సమాచారాన్ని పేర్కొన్నారని తెలిపారు. అనంతరం జూన్ 12న నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ తీర్మానాన్ని అనుసరిస్తానని చెప్పినా, తర్వాత మహిళా సంఘాల తీర్మానం తీసుకురావాలని సూచించారని ఆరోపించారు. మహిళా సంఘాల తీర్మానం సమర్పించిన అనంతరం సర్పంచ్ తీర్మానం కావాలని, అది ఇచ్చిన తర్వాత త్రీమెన్ కమిటీ తీర్మానం కావాలని కోరుతూ ప్రక్రియను జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. త్రీమెన్ కమిటీ సమావేశంలోనూ కొత్త మహిళా సంఘాలకు అవకాశం ఇవ్వకుండా, గత నాలుగేళ్లుగా మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న వారినే కొనసాగించేలా ప్రధానోపాధ్యాయురాలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, తమ విషయంలో మాత్రం వివక్ష చూపుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా, గత ఫిబ్రవరిలో పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు మద్యం, కూల్‌డ్రింక్ బాటిళ్ల తెచ్చుకొని తరగతి గదిలో సేవించిన ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు విచారణ చేపట్టకపోవడం కొసమెరుపు. ఈ అంశాలతో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణ వివాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది స్థానికంగా చర్చనీయాంశమైంది.

## విద్యార్థులతో చర్చలు జరపండి

**ప్రధాని మోదీకి అన్నా హజారే లేఖ**



ఢిల్లీలోవిద్యార్థుల నిరసనలపై జరిగిన పోలీసుల అణచివేత ఘటనలపై ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రజాస్వామ్యంలో ఘర్షణల కంటే చర్చలే ఎప్పుడైనా మెరుగైన మార్గమని ఆ లేఖలో పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను భగ్నం చేసేందుకు పోలీసులు అనుసరించిన బల ప్రయోగం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

# స్త్రీ నిధి రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) జులై 22**



భద్రాది కొత్తగూడెం :జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రికవరీ శాతం తక్కువగా ఉన్న మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులను జిల్లా కలెక్టర్ నేరుగా కారణాలు అడిగి తెలుసుకున్నారు. రికవరీలో వెనుకబడడానికి దారితీసిన అంశాలను విశ్లేషించి, ఆయా మండలాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ ఆశించిన స్థాయిలో లేదని, మండల స్థాయిలో పెండింగ్ బకాయిలు అధికంగా ఉన్నాయని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ శాతం కేవలం 13.5 శాతం మాత్రమే ఉండగా, రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రికవరీ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 239 వీవోల వద్ద సున్నా కలెక్షన్లు నమోదయ్యాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, అశ్వరావుపేట ప్రాంతాల్లో రికవరీ శాతం తక్కువగా ఉందని పేర్కొంటూ, ఈ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణ గ్రహీతలను కలిసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. బకాయిలు ఉన్న ప్రతి మహిళా సంఘాన్ని గుర్తించి, రుణాల సకాల చెల్లింపుపై సభ్యులకు అవగాహన కల్పిస్తూ వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని, ప్రతి రోజు ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు రికవరీ పురోగతిపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో రోజువారీ సమీక్షలు నిర్వహించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని, మెరుగైన పనితీరు కనబరిచిన మండలాలను అభినందిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారణ చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, స్త్రీ నిధి రుణాల రికవరీ పెంపు ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా ప్రత్యేక రికవరీ ప్రణాళిక రూపొందించి, వీవోలు, ఏపీఎంలు, మండల సమాఖ్యలు ప్రతిరోజూ రికవరీ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బకాయిలు ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యక్తిగతంగా కలిసి రుణాల చెల్లింపుపై అవగాహన కల్పించాలని, అవసరమైతే ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. సకాలంలో రుణాలు చెల్లించే సంఘాలను ప్రోత్సహించడంతో పాటు, జాప్యం చేస్తున్న సంఘాలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. రికవరీలో వెనుకబడిన మండలాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ రోజువారీ పురోగతిని సమీక్షిస్తామని చెప్పారు. సకాలంలో రుణాల చెల్లింపు వల్ల మహిళా సంఘాల ఆర్థిక విశ్వసనీయత పెరిగి, భవిష్యత్తులో అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.అనంతరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వీవో భవనాల పురోగతి, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల స్థాపనకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి మహిళా సంఘాలకు మరింత ఆదాయ వనరులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, డిపిఓ అనూష, అడిషనల్ డిఆర్డిఏ నీలేష్,సంబంధిత అధికారులు, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.



## భూసమస్యలకు శాశ్వత పరిష్కారమే ‘భూభారతి’ లక్ష్యం

- అదనపు కలెక్టర్ బీ.ఎస్. లత స్పష్టం
- రీ-సర్వేలో అధికారులకు రైతులు సహకరించాలి
- ఆధునిక సాంకేతికత, జియో ట్యాగింగ్‌తో భూముల గుర్తింపు

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై 22**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘భూభారతి’ రీ-సర్వే పనులను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తిచేసి రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీ.ఎస్. లత పేర్కొన్నారు. భీమ్ రాజ్ పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం భూభారతి రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సు, గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,జియో ట్యాగింగ్ పద్ధతి ద్వారా ప్రభుత్వ, పట్టా భూములను స్పష్టంగా వేర్వేరుగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. భూముల సరిహద్దు వివాదాలకు తావులేకుండా, లోటుపాట్లను సరిదిద్దేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని, సర్వే మరియు రెవెన్యూ అధికారులకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామసభల ద్వారా వివాదాల పరిష్కారం: వివాదాస్పద భూముల వివరాలను నేరుగా గ్రామసభల్లో చర్చించి, పారదర్శకంగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. డిజిటల్ భూధార్ ఖ కొత్త పాస్ పుస్తకాలు: సర్వే పూర్తయిన ప్రతీ భూమికి ప్రత్యేక మ్యాప్ తయారు చేస్తారని.. రైతులకు ‘భూధార్’ (డిజిటల్ భూ గుర్తింపు సంఖ్య) కేటాయించి, కొత్త పాస్ పుస్తకాలను జారీ చేస్తామని వివరించారు.

### లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు:

పెండింగ్ సర్వే దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా అందుబాటులోకి తెచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి, ఉప సర్పంచ్ బొమ్మెన రాజమ్మ స్థానిక తహశీల్దార్, మాజీద్ మహమ్మద్ అబ్దుల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎడ్ల జీవన్ పంచాయతీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు సాగర్, తిరుపతి, కుమార్, ప్రవీణ, దీవెన, రాజేశ్వరి, గంగవ్వలతో పాటు గ్రామ పెద్దలు, రైతు సోదరులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

## వృద్ధులను గౌరవిద్దాం , వేధిస్తే చట్టం కఠిన చర్యలు

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి – హేమ భార్గవి**

**(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) జూలై 22**



జిల్లాలో వృద్ధులపై శారీరక దాడులు, మానసిక వేధింపులు, ఆర్థిక దోపిడీ, ఆస్తి కోసం ఒత్తిడి చేయడం, ఇంటి నుండి బయటకు పంపించడం, నిర్లక్ష్యం చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఇది మానవత్వానికి, కుటుంబ విలువలకు మరియు చట్టానికి విరుద్ధమైన చర్య అని సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి అన్నారు ప్రతి కుమారుడు, కుమార్తె తెలుసుకోవలసిన చట్టాలు మైంటెనెన్సు అండ్ వెల్ఫేర్ అఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ , 2007లి ప్రకారం తల్లిదండ్రుల పోషణ, వైద్య సంరక్షణ, నివాసం మరియు సంక్షేమం కల్పించడం పిల్లల చట్టబద్ధమైన బాధ్యత. తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు విచారణ చేసి తగిన ఆదేశాలు జారీ చేస్తారు. తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటెబిలిటీ అండ్ మానిటరింగ్ అఫ్ పేరెంటల్ సపోర్ట్ యాక్ట్ , 2026లిలి ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు మరియు చట్టం వర్తించే ఇతర ఉద్యోగులు తమ ఆధారపడిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినట్లు నిర్ధారణ అయితే, వారి స్థూల వేతనం నుండి 15% లేదా ?10,000 (ఏది తక్కువైతే అది) వరకు నేరుగా తల్లిదండ్రులకు చెల్లించేలా ఆదేశాలు జారీ చేయవచ్చు.

### వృద్ధులను కొట్టడం, బెదిరించడం, వేధించడం నేరం

వృద్ధులను కొట్టడం, గాయపరచడం, బెదిరించడం, బలవంతంగా ఇంటి నుండి పంపించడం, ఆస్తి కోసం హింసించడం వంటి చర్యలు భారతీయ న్యాయ సంహిత (భారతీయ న్యాయ సంహిత ), 2023 ప్రకారం క్రిమినల్ నేరాలు. పరిస్థితిని బట్టి పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ నిర్వహించి, అరెస్టు చేయడం, న్యాయస్థానంలో అభియోగాలు నమోదు చేయడం వంటి చర్యలు తీసుకోవచ్చు.

### వృద్ధుల ఆస్తి హక్కులు

వృద్ధుల పేరున్న ఇల్లు, భూమి లేదా ఇతర ఆస్తులపై వారికి పూర్తి హక్కు ఉంటుంది. పిల్లలు లేదా బంధువులు బలవంతంగా ఆస్తిని స్వాధీనం చేసుకోవడం, ఇంటి నుండి బయటకు పంపించడం లేదా వేధించడం చట్టవిరుద్ధం. వృద్ధుల ఆస్తిలో నివసిస్తూ వారిని పోషించకుండా, వేధింపులకు గురి చేస్తే, జిల్లా కలెక్టర్/జిల్లా మేజిస్ట్రేట్ ముందు ఫిర్యాదు చేసి, అవసరమైతే పిల్లలు లేదా ఆక్రమణదారులను ఆస్తి నుండి ఖాళీ చేయించే (ఎవిక్షన్ ) చర్యలు కూడా తీసుకోవచ్చు అన్నారు తల్లిదండ్రులను గౌరవిద్దాం అని, వృద్ధులపై శారీరక, మానసిక, ఆర్థిక వేధింపులకు పాల్పడవద్దు. వారి ఆరోగ్యం, ఆహారం, నివాసం మరియు భద్రతను నిర్ధారిద్దాం. వృద్ధులపై వేధింపులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించండి. తల్లిదండ్రులను గౌరవించడం మన సంస్కృతి -- వారిని రక్షించడం మన చట్టబద్ధమైన బాధ్యత అని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు .

# ఇంటింటికి నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలన

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలి – జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌లి

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )జూలై 22**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో ఇంటింట నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా, ఫారాలను కూడా ఈ ఆగస్టు 3వ తేదీలోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ప్రజలను కోరారు. ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి అర్హ ఓటరు ఆగష్టు 3వ తేదీలోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# గోపాలపురం కాలనీలో 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమం.






- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్
- మహిళల, బాలల భద్రతలో పోలీస్ అక్క సేవలు అందిస్తున్నాం.
- సామాజిక అంశాల పట్ల అవగాహనతో వ్యక్తిగత భద్రత.
- ప్రజల భద్రతలో రాత్రింబవళ్ళు పోలీస్ కృషి చేస్తుంది.
- సామాన్యులకు అండగా ఉంటాం, నేరాలకు పాల్పడేవారిపట్ల కఠినంగా ఉంటాం.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 22**

సూర్యాపేట జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమంలో భాగంగా, ఈరోజు సూర్యాపేట పట్టణ పోలీసుల నేతృత్వంలో గోపాలపురం కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు ముఖ్య అతిథిగా హాజరై కాలనీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజల వద్దకే పోలీస్ సేవలను చేర్చడం మరియు ప్రజలకు భరోసాగా ఉండదనే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమాజంలో మహిళలు, బాలల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రణాళిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు, వారి రక్షణలో "పోలీసు అక్క" సేవలు అందిస్తూ బాధిత మహిళలకు అండగా ఉంటున్నారు, ప్రతి పోలీస్ స్టేషన్ కు ఒక పోలీస్ అక్కను నియమించాం అన్నారు. ప్రజల భద్రతలో పోలీసులు రాత్రింబవళ్ళు కృషి చేస్తూ కాలనీలు, గ్రామాల్లో నిఘా ఉంచి గస్తీ నిర్వహిస్తున్నారు. యువత, పౌరులు నేరాలకు పాల్పడుతూ కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో సమస్యలు వస్తాయి, విదేశాలు వెళ్లే విషయంలో, ఉద్యోగాలు పొందే సమయంలో సమస్యలు వస్తాయి అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని సమాజ రక్షణకు పాటుపడాలి అన్నారు. నేరాల నిరోధం, సేసుల చేదనలో సాంకేతిక పరిజ్ఞానం తో పని చేస్తున్నాం అన్నారు. జిల్లా కేంద్రానికి 600 సీసీ కెమెరాలు అనుసందానం చేసి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాము. వృద్ధుల రక్షణ కోసం పోలీస్ స్టేషన్ ల వారీగా సీనియర్ సిటిజన్ భద్రత కమిటీలు ఏర్పాటు చేశాం అన్నారు. సామాజిక అంశాలైన సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నిర్మూలన, సోషల్ మీడియా ప్రభావం, సీసీ కెమెరాల ఏర్పాటు ఉపయోగం, మరియు వృద్ధుల సంక్షేమంపై కాలనీ వాసులకు విస్తృత అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కాలనీకి వస్తె పోలీసులకు సమాచారం ఇవ్వాలి, అపరిచితులు ఎవరైనా మెసేజ్ చేసిన, ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగిన, బ్యాంక్ వివరాలు అడిగా సమాచారం ఇవ్వొద్దు, డబ్బులు అడిగితే పంపించవద్దు అన్నారు. రోడ్డు ప్రయాణ సమయంలో జాగ్రత్తగా ఉండాలి అన్నారు, రోడ్డు భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల పై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం, అతివేగంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు వివరించారు. జాతీయ రహదారులు వెళ్లే ప్రధాన పట్టణంగా ఉన్నది వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు, రోడ్డుపై వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు. గంజాయి నుండి మన సమాజాన్ని మన పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నారు. గంజాయి డ్రగ్స్ లాంటి వాటి సమాచారం పోలీసులకు ఇవ్వాలి అన్నారు. డయల్ 100, 112 లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న షీ టీమ్ సభ్యులు, పోలీస్ కళా బృందం వారు తమ ఆటపాటల ద్వారా మహిళల రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను, చట్టాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, 36వ వార్డు కౌన్సిలర్ మన్సూర్ బి ఫారూక్, ఎస్ఐ లు యాదవేందర్ రెడ్డి కనకరత్నం, షీ టీం ఎస్ఐ నీలిమ మరియు పట్టణ పోలీస్ సిబ్బంది, స్థానిక కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మడేలేశ్వర స్వామిని దర్శించుకున్న నల్ల మనోహర్ రెడ్డి

- వడ్కాపూర్‌లో బోనాల మహోత్సవంలో ప్రత్యేక పూజలు..
- ప్రజల సుఖశాంతులు, రైతుల సుభిక్షం కోసం ప్రార్థన

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 22**

పెద్దపల్లి నియోజకవర్గంలోని జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ మడేలేశ్వర స్వామి బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నల్ల మనోహర్ రెడ్డి, రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. గ్రామీణ ప్రాంతాల్లో బోనాల వంటి సాంప్రదాయ ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులతో నల్ల మనోహర్ రెడ్డి ఆప్యాయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టార్గెట్ టాప్ 5.. నేటి నుంచే కామన్వెల్త్ గేమ్స్

- 74 దేశాల నుంచి 3 వేల మంది అథ్లెట్ల పోటీ..
- బాక్సింగ్, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్‌పై భారత్ ఆశలు
- 10 ఆటలకు కుదించడంతో కళతప్పిన మెగా ఈవెంట్



మల్టీ స్పోర్టింగ్ ఈవెంట్లలో భారత్ పతకాల మోత మోగించే ప్రతిష్టాత్మక క్రీడోత్సవం కామన్వెల్త్ గేమ్స్. గత రెండు దశబ్దాల నుంచి ప్రతీ ఎడిషన్‌లో మన దేశం టాప్-5లో నిలుస్తూ వస్తోంది. కానీ, స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదిక 13వ ఎడిషన్ కామన్వెల్త్ గేమ్స్ గురువారం మొదలవుతుండగా మన అథ్లెట్లలో మునుపటి సందడి కనిపించడం లేదు. ఒకప్పుడు బ్రిటీష్ పాలనలో ఉన్న 74 కామన్వెల్త్ దేశాల నుంచి 3 వేల మంది క్రీడాకారులు ఈ మెగా ఈవెంట్‌కు రెడీ అయినా.. పెద్దగా హంగామా లేదు. ఈసారి పోటీల సంఖ్య సగానికి తగ్గిపోవడమే అందుకు కారణం. ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం ఆర్థిక కారణాలతో ఆతిథ్య హక్కులను వదులుకోవడంతో గ్లాస్గో నగరం నాలుగు వేదికల్లో 10 ఆటలతోనే ఈ కావన్వెల్త్‌ను కానిచ్చేస్తోంది. ఇందులో ఆరు క్రీడాంశాల్లో పారా గేమ్స్ కూడా జరగనున్నాయి. ఆటల సంఖ్య తగ్గడంతో తన టాప్-5 హోదాను నిలబెట్టుకోవడానికి భారత్ బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ క్రీడాకారులపై ఆధారపడుతోంది. 1994 తర్వాత అతి తక్కువ ఆటలో జరుగుతున్న తాజా ఎడిషన్‌లో మనదేశం మొత్తంగా 125 మంది అథ్లెట్లతో బరిలోకి దిగుతోంది. తొలి రోజు భారత్ లాన్‌బౌల్స్‌లో పోటీ పడనుంది. రాత్రి 10.30 నుంచి ఒవో హైడ్రో స్టేడియంలో గేమ్స్ ప్రారంభోత్సవం జరుగుతుంది.

### భారత పతకాలపై ప్రభావం

అటు ఆటలు, ఇటు బడ్జెట్ తగ్గడంతో కామన్వెల్త్ గేమ్స్ ఉనికిని కోల్పోయే ప్రమాదం కనిపిస్తుండగా.. 2002 నుంచి ప్రతి ఎడిషన్‌లోనూ టాప్-5లో నిలుస్తూ వస్తున్న భారత్‌కు ఈసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. భారత్‌కు పతకాలు దక్కే రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, షూటింగ్‌క్రీడలు లేకపోవడం పెద్ద లోటుగా మారింది.

## రోడ్డు భద్రతపై రాజీ లేదు - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

- హైవేలపై అక్రమ పార్కింగ్, ఆక్రమణల తొలగింపునకు డెడ్ లైన్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 22**



రోడ్డు ప్రమాదంలో పోయే ప్రతి ప్రాణం అత్యంత విలువైందని, ఇకపై రహదారి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై వ్యక్తిగత శిక్షలు, భారీ జరిమానాలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ హెచ్చరించారు. రాజస్థాన్, రంగారెడ్డి జిల్లాల్లో జరిగిన భారీ ప్రమాదాలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించిన నేపథ్యంలో.. జిల్లా స్థాయిలో రవాణా, రెవెన్యూ, విద్య, వైద్యం, పోలీస్, ఆర్ అండ్ బి, పంచాయతీ, నేషనల్ హైవే అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి రోడ్లపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను వెంటనే గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే 45 రోజుల్లోగా ప్రమాదకర ప్రాంతాల పూర్తి జాబితాను సిద్ధం చేయాలని, 4 నెలల్లోగా ఆయా ప్రాంతాల్లో హై-ఇంటెన్సిటీ ఎల్ఈడి లైట్లు, స్పీడ్ కెమెరాలు, రెట్రో-రిఫ్లెక్టివ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్స్ ఇవ్వాలన్నారు.

### హైవేలపై అక్రమ పార్కింగ్ చేస్తే చలానానే

జాతీయ రహదారుల మెయిన్ రోడ్డు, పక్కన ఉన్న షోల్డర్స్‌పై భారీ వాహనాలను పార్క్ చేయడంపై పూర్తి నిషేధం అని తెలిపారు. వాహనాలను కేవలం నిర్దేశిత లే-బై ప్రాంతాల్లో లేదా పెట్రోల్ బంకుల వద్ద మాత్రమే ఆపాలని సూచించారు. ప్రతి 75 కిలోమీటర్లకు ఒక లే-బై సదుపాయం ఉండేల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు మీరితే ఈ-చలానా, జీపీఎస్ ఆధారిత ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఆక్రమణల తొలగింపునకు గడువు

హైవేల పక్కన నిబంధనలకు విరుద్ధంగా వెలసిన దాబాలు, హోటళ్లు, వాణిజ్య నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కొత్తగా ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, పాత అనుమతులను 30 రోజుల్లోగా సమీక్షించి, అక్రమంగా ఉంటే రద్దు చేయాలని తెలిపారు. డ్రోన్ సర్వేల ద్వారా ఆక్రమణలను తొలగించాలన్నారు.

### రూ.1.5 లక్షల వరకు ఉచితం

ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి 75 కిలోమీటర్లకు ఒక బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని,ట్రామా కేర్ సెంటర్లను మ్యాపింగ్ చేసి, బాధితులకు రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించే పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు.

### ప్రతి 15 రోజులకోసారి రివ్యూ

రోడ్డు భద్రతపై కేవలం మాటలు కాకుండా చేతల్లో చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి 15 రోజులకోసారి ఫాలో-అప్ మీటింగ్ ఉంటుందని, ఆర్టికల్ 21 ప్రకారం పౌరుల జీవించే హక్కును కాపాడటమే అధికారుల తొలి ప్రాధాన్యత కావాలని ఆదేశించారు. కార్యక్రమం లో డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, ఆర్టీవో పురుషోత్తం రెడ్డి, డిపిఓ యాదగిరి, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, డీఈఓ అశోక్, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ

ముడిమడుగుల మల్లన్న

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 22**



దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీలు, నిర్బంధాలకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న విమర్శించారు. విద్యార్థులను ఈడ్చుకెళ్లి పోలీస్ వాహనాల్లో తరలించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగ పాలన కొనసాగుతోందా లేక నిరంకుశ పాలన నడుస్తోందా అనే సందేహాలు తలెత్తుతున్నాయని అన్నారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. దేశ భవిష్యత్తుకు పునాదులైన విద్యార్థులే రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులుగా ఎదుగుతారని మల్లన్న పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులపై లాఠీలతో దాడులు చేసి గాయపరచడం బాధాకరమని, ఇటువంటి ఘటనలతో దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో గిరిజనుల రాజ్యాంగ హక్కులైన ఐదో, ఆరవ షెడ్యూళ్ల అమలుపై నిర్లక్ష్యం కొనసాగుతోందని, అడవులు, సహజ వనరుల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి వంటి మౌలిక అవసరాలు అందకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై జరిగిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, విద్యార్థి లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యవాదులు, రైతు, కార్మిక, విద్యార్థి సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని ముడిమడుగుల మల్లన్న పిలుపునిచ్చారు.

## గాంధీభవన్ వద్ద బీజేపీ నేతలపై దాడి దుర్మార్గం

- కాంగ్రెస్ గుండాగిరిని సహించబోమన్న ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 22**



గాంధీభవన్ ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టిన బీజేపీ నాయకులపై దాడికి దిగడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్ వద్ద చోటుచేసుకున్న ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నివాసం ఎదుట నిర్వహించిన ధర్నాకు నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు ఆధ్వర్యంలో గాంధీభవన్ ముందు శాంతియుత ధర్నా నిర్వహించారని తెలిపారు. అయితే, బీజేపీ నాయకులను అడ్డుకుని కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం దురదృష్టకరమని విమర్శించారు. ఇలాంటి దౌర్జన్యాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, తెలంగాణలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలిగించేలా కాంగ్రెస్ నేతల వ్యవహారం ఉందని కొమరయ్య వ్యాఖ్యానించారు. రాజకీయ విభేదాలు ఉన్నా హింసాత్మక చర్యలకు దిగడం సమంజసం కాదని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం తగదన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం దాడులు, గుండాగిరికి పాల్పడడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించిన ఆయన, ఇలాంటి ఘటనలను బీజేపీ సహించబోదని హెచ్చరించారు. సంబంధిత ఘటనపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## గార్లలో డీజే ఆపరేటర్లతో అవగాహన కార్యక్రమం

గార్ల, బయ్యారం సిఐ రవీందర్ ఆధ్వర్యంలో

**పగడాల రామారావు (ప్రజాతీర్పు గార్లమండల ప్రతినిధి )22**

స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం డీజే సౌండ్ ఆపరేటర్లతో గార్ల బయ్యారం సీఐ రవీందర్ అధ్యర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్సవాలు, పెళ్లిళ్లు మరియు ఇతర కార్యక్రమాలలో డీజే సౌండ్ లిమిట్ పాటించాలని, అర్ధరాత్రి వరకు మాత్రమే అనుమతి ఉందని సూచించారు. అతిగా సౌండ్ పెట్టడం వల్ల ప్రజలకు, వృద్ధులకు, విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ సౌండ్ సిస్టమ్స్ వాడవద్దని, పోలీసులకు అనుమతి తీసుకొనే డీజే ఉపయోగించాలని ఆపరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గార్ల ఎస్ఎస్ సాయికుమార్, ఏఎస్ఐవెంకటరెడ్డి పలువురు డీజే ఆపరేటర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జున్ రన్నరప్‌తో సరి

భారత నంబర్ వన్ ఆటగాడు, తెలంగాణ కుర్రాడు ఇరిగేశి అర్జున్ చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో సెకండ్ రన్నరప్‌గా నిలిచాడు. టైటిల్‌పై ఆశలు రేపిన అర్జున్ బుధవారం జరిగిన చివరి, ఏడో రౌండ్‌లో ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలీరెజా ఫిరౌజాతో గేమ్‌ను 41 ఎత్తుల తర్వాత డ్రా చేసుకున్నాడు. దాంతో ఫిరౌజా 4.5 పాయింట్లతో టైటిల్ నెగ్గగా.. అర్జున్, రష్యా జీఎం దిమిత్రి ఆండ్రీకిన్ చెరో 4 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. టైబ్రేక్ స్కోరు ఆధారంగా ఆండ్రీకిన్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా.. అర్జున్ సెకండ్ రన్నరప్‌తో సరిపెట్టాడు. వరల్డ్ చాంపియన్ డి. గుకేశ్ ఏడు రౌండ్లలో రెండు పాయింట్లు మాత్రమే నెగ్గి చివరి స్థానంలో నిలిచి తీవ్రంగా నిరాశపరిచాడు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020